
# “ అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి? “



జిడ్డు కృష్ణమూర్తి గారు




రచన :

బ్రహ్మర్షి

తటవర్తి వీరరాఘవరావు

# " అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి? "



రచన & ప్రచురణ: బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు, B.Sc.,

మొదటి ముద్రణ : సెప్టెంబరు, 2026

ప్రతులు : 1,000

వెల : రూ. 70/-

పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) "అహం దేహాస్మి" నుంచి "అహం బ్రహ్మాస్మి" అనే స్థితికి ఎదగాలి | - | రూ.70/- |
| 12) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 13) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 14) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 15) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 16) పంచకోశాలు | - | రూ.60/- |
| 17) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 18) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 19) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 20) జన్మరాహిత్య స్థితికి మార్గం | - | రూ.60/- |
| 21) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు | - | రూ.60/- |
| 22) మాయకు వశమైనవాడి లక్షణాలు | - | రూ.60/- |
| 23) ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు ఏమిటి? | - | రూ.60/- |
| 24) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 25) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 26) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 27) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 28) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 29) అహంకారం ఎలా పోతుంది | - | రూ.50/- |
| 30) మానవుల్లో అసంతృప్తికి కారణం | - | రూ.50/- |
| 31) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 32) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

# “ అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి? “

లోకంలో అందరూ ఎంతసేపు జరుగుతున్న ఈ జీవితానికే ప్రాముఖ్యం ఇస్తున్నారు కానీ చనిపోయిన తర్వాత కూడా మనం ఉంటాము, ఆ జీవితం గురించి కూడా మనం తెలుసుకోవాల్సింది ఉంది అన్నది తెలుసుకోవడం లేదు. దాని తర్వాత ఇంకొక జన్మ వస్తుంది, ఆ జన్మలో కూడా ఇప్పుడు చేసుకున్న దాన్ని బట్టే ఆ భవిష్యత్ జన్మ ఆధారపడి ఉంటుంది అని తెలుసుకోవాలి.

నిజంగా ఎవరూ దేహాలు కాదు, అందరూ ఆత్మలే. ఆత్మలైన మీరు ఆత్మలాభం కోసం చేయవలసిన పనులు చేస్తే అది భవిష్యత్తుకు ఎంతో లాభిస్తుంది, ఆత్మ ఉన్నతికి తోడ్పడుతుంది అని తెలసుకోవాలి.

ఇది అర్థమైన వాళ్ళకు ఆత్మ కోసం ఏదో చేసుకోవాలి! అనే తపన ఉంటుంది. కానీ సంసారము, ఉద్యోగము, కుటుంబ వ్యవహారాలు అనుకోని సమస్యలు భౌతికమైన అవసరాలు, మమకారాలు, బంధాలు, బాధ్యతలు వీటన్నిటి వల్ల చెయ్యాలని అనుకున్నా చెయ్యలేకపోతున్నారు.

చాలామంది మాకు చెయ్యాలని ఉంది కానీ చెయ్యలేకపోతున్నాం అని అంటారు. అక్కడికి నేను చెప్తూ ఉంటాను, ఎంత చెయ్య లేకపోయినా, అవకాశం ఉన్నంత మేర, మీకున్న ఖాళీ సమయం ఆత్మ కోసం వినియోగించు కోండి. ఈ జన్మలో ఏ ఆటంకాలు అయితే, అవరోధాలు అయితే మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాయో! వాటి వల్ల చెయ్యాలని అనుకున్నా చెయ్యలేక పోతున్నారో! వాటిని ఎంత చెయ్యగలరో అంతా చెయ్యండి.

అప్పుడు ఖచ్చితంగా మీ భవిష్యత్తు జన్మ అనుకూలమైన జన్మ

లభిస్తుంది. ఇప్పుడు ఆర్థిక ఇబ్బంది ఉండొచ్చు, ఇప్పుడు మీరు చేసిన కృషి వల్ల భవిష్యత్ జన్మలో అటువంటి ఇబ్బందులు ఉండవు.

నా ఉద్దేశం అయితే అటువంటి జన్మ లభించినప్పుడు అదే ఆఖరి జన్మ కావచ్చు, లేకపోతే మరొక్క జన్మలోనయినా మీ లక్ష్యం పూర్తి చేసుకుంటారు. ఇప్పుడు మీకు సంసారపరంగా ఇబ్బందులు ఉండొచ్చు, ఎంత చేద్దాం అనుకున్నా! భార్య వల్ల భర్తకు, భర్త వల్ల భార్యకు కూడా ఇబ్బందులు ఉండచ్చు.

చెయ్యాలనుకున్నా చెయ్యలేకపోతూ ఉండొచ్చు. అలాగే పిల్లల వల్ల కూడా చాలా మంది చెయ్యాలనుకున్నది చెయ్యలేకపోతూ ఉండొచ్చు. కానీ ఎన్ని ఉన్నా, మీ పట్టుదల వదలకుండా ఉన్నంతలో చెయ్య గలిగినంత చేస్తూ ఉంటే, అది ఖచ్చితంగా మీ భవిష్యత్ జన్మకి ఎంతో సహకరిస్తుంది.

అంటే ఇప్పుడు మీరు చేసుకున్నది వృథా కాదు. ఇప్పటికీ మీలో చాలామంది కొన్ని సంవత్సరాల నుంచి భీమవరం వస్తూ, ఎంతో జ్ఞానాన్ని నేర్చుకుంటూ, జ్ఞానపరంగా ఎదగడానికి, బుద్ధిని పెంచుకోవడానికి, ఎంతో కృషి చేస్తున్నారు.

ప్రపంచం అంతా దేహం కోసం చేస్తూ ఉంటే మీరు మాత్రం ఆత్మ కోసం చేస్తున్నారు నిజంగా మీరు చాలా అదృష్టవంతులు.

అంతే కాదు నెలకు ఒక్కసారి ఈ మూడు రోజుల క్లాసులో పాల్గొంటున్నా, ప్రతిరోజు మార్నింగ్ జూమ్ లో మీరు పాల్గొంటూ ఆత్మకు లాభించే ఎంతో జ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. చెప్పిన విషయాలు, సూచనలు, మెళుకువలు నోట్ చేసుకుంటూ ఆచరించే ప్రయత్నం చేస్తున్నారు.

గొప్ప గొప్ప వాళ్ళ సందేశాల ద్వారా ఎన్నో విషయాలు తెలుసు కుంటున్నారు. బ్రేక్ లేకుండా భీమవరం రమ్మంటే వస్తున్నారు, జూమ్‌లో

వీడియోలు ఆన్ చేయమంటే ఆన్ చేస్తున్నారు. అంటే చాలా శ్రద్ధ కనపరుస్తున్నారు, ఇంత శ్రద్ధ ఉంటే జ్ఞానం ఎందుకు పెరగదు!

**ఈ మధ్యనే జిడ్డు కృష్ణమూర్తి గారి సందేశాన్ని నేను చదవడం జరిగింది.** ఆ సందేశం నన్ను ఎంతగానో ఆకర్షించింది. ఈ ప్రపంచంలో నేను దేహం అని అనుకుంటూ బ్రతికే వారి గురించి ఆయన ఒక గొప్ప సందేశం ఇచ్చారు, ఆ సందేశం ఏమిటంటే!.

## "అందరి కోసం బ్రతికినా మీకు దక్కింది ఏమిటి"?

ఈ ఒక్క సెంటెన్స్ లో ఎంత అర్థం ఉందండి. అందరి కోసం బ్రతికినా మీకు దక్కింది ఏమిటి?

ఇది అర్థం అవ్వాలి అంటే! ముందు నేను ఆత్మ అన్నది తెలుసుకోవాలి. అంటే ఆత్మైన మీ గురించి ఆయన సంబోధిస్తూ ఈ వాక్యం చెప్పడం జరిగింది. మీకు దక్కింది ఏమిటి? మీకు అంటే ఇక్కడ ఆత్మ.

అందరి కోసం బ్రతికినా, అన్నారు. మీరంటే ఎవరు ఆత్మ. ఇప్పుడు మీరు బ్రతికేది ఎవరి కోసం? ఆత్మ కోసం. కానీ నిజ జీవితంలో మీరు బ్రతుకుతున్నది అందరి కోసం.

అంటే భార్య, భర్త, అబ్బాయి, అమ్మాయి , తల్లి, తండ్రి, బంధువులు అందరి కోసం బ్రతుకుతున్నారు.

గొప్ప మహానుభావుడు **జిడ్డు కృష్ణమూర్తి గారు** ఈ సందేశం ఇచ్చారు.

ఏమండీ! పుట్టినప్పటి నుంచి కుటుంబం కోసం, పిల్లల కోసం బ్రతికారు కదా? చచ్చీ చెడి ఇందులోకి వచ్చారు. ఇందులోకి వచ్చి ఈ మార్గంలోకి వచ్చి మళ్ళీ దృష్టంతా వాళ్ళ మీదే ఉంటే, అంటే వాళ్ళ కోసం సంపాదించి, సంపదలు సమకూర్చు కుని, వారి సుఖాల కోసం జీవితమంతా

వెచ్చిస్తే! అసలు మీరు ఎవరి కోసం బ్రతుకుతున్నట్టు?

నిజంగా మీ కోసం అంటే ఆత్మ కోసం మీరు బ్రతకట్లేదు. **"అసలు మీరు అంటే ఆత్మ వచ్చింది మీ కోసం, కాని బ్రతుకుతున్నది అందరి కోసం".**

మీరు పురుషుడైతే రాత్రి పగలు కష్టపడి సంపాదిస్తారు, ఎవరి కోసం? అంటే పెళ్ళాం, పిల్లల కోసమే కదా? స్త్రీ అయితే భర్తకోసం, పిల్లలు కోసం జీవితమంతా కష్టపడుతున్నారు. అంతేకాదు ఇల్లు కడతారు, పొలాలు కొంటారు, డబ్బు సంపాదిస్తారు. లాకర్లో, బ్యాంకుల్లో కూడా వేస్తారు. ఎన్నో చేస్తూ ఉంటారు, ఖాళీ లేకుండా కష్టపడతారు. ఆఖరికి  భీమవరం రావడానికి కూడా ఖాళీ ఉండదు! ఎక్కడండి మా ఉద్యోగం! సెలవులు ఉండవండి అంటారు.

అలా కష్ట పడుతూ, మిమ్మల్ని అంటే ఆత్మను త్యాగం చేస్తున్నారు. అంటే మిమ్మల్ని మీరు త్యాగం చేసుకొని, అందరి కోసం బ్రతుకుతున్నారు.

సరే బ్రతుకుతున్నారు, బాగానే ఉంది. ఆయన ఏమని ప్రశ్నిస్తున్నారు అంటే! సరే బ్రతికావు, అసలు నీకు దక్కింది ఏమిటి?

ఎందుకంటే మీరు చనిపోయి పైకి వెళ్ళాక అక్కడ కౌన్సిలింగ్ చేసేవాళ్ళు అడుగుతారు. అందరి కోసం బ్రతికావు. ఎన్నో చేశావు, ఎన్నో సాధించావు, ఎన్నో సంపాదించావు, ఎన్నో పోగేశావు కాని ఇక్కడికి వచ్చాక నీకు దక్కింది ఏమిటి? అని అడుగుతారు. అప్పుడు అర్థమవుతుంది జీవితమంతా కష్టపడ్డానే, ఎన్నో సంపాదించేనే, కాని ఒక్కటి నాకూడా రాలేదు, ఒక్కరు నాకోసం రాలేదు, అని ఆశ్చర్య పోతాడు.

వాళ్ళు ఇదే ప్రశ్న వేస్తారు, నాయనా! ఒక జీవితం జీవితం అంతా బ్రతికావు, అందరి కోసం బ్రతికావు, అందరి కోసం ఎన్నో చేశావు, మరి నీకు ఏం దక్కింది నాయనా అంటారు.

అందుచేత మీరు ఏ పని చేస్తున్నా, ఏమి సంపాదిస్తున్నా, ఏమి సమకూర్చుకుంటున్నా, ముందు ఒక ప్రశ్న వేసుకోవాలి. ఇది నాకు అంటే ఆత్మకు లాభమా? దేహానికి లాభమా? అని.

కానీ ఈ ప్రశ్న నేను చాలా సార్లు వేసుకుంటున్నాను, ఇప్పటికీ వేసుకుంటాను కూడా. ఒకవేళ ఎక్కడికైనా వెళ్ళడానికి బద్ధకించినా ఈ ప్రశ్న వేసుకుంటే మటుకు ఇంటి దగ్గర ఉండ బుద్ధి కాదు. మీరు దేహం నేను అనుకుంటే కిరాణ కొట్టులో కూర్చుంటారు, ఆత్మ నేను అనుకుంటే జూమ్ లోకి వస్తారు, భీమవరం వస్తారు.

నేను మటుకు పత్రి గారు పరిచయం అయ్యేదాకా దేహం నేను అన్నట్టుగానే జీవించాను, అత్మ కోసం ఏమీ చేయలేదు.

కానీ పత్రి గారు పరిచయం అయ్యాక, గాలి వేస్తే మేఘాలు విడిపోయినట్టు, నా అజ్ఞానం మెల్లిగా పోయింది. ఈ 'మేను నేను కాదు', 'ఈ మేనులో ఉన్న అసలు నేనే, "నేను" అని బాగా అర్థమయింది. అప్పటినుంచి ఈ మేను అనే 'నేను'కు ప్రాముఖ్యం తగ్గించి అసలు 'నేను' నేను అన్నట్టుగా జీవించడం మొదలు పెట్టాను. అందుచేత అప్పటిదాకా  అందరి కోసం మీరు బ్రతికినా, ఏమి చేసినా, సంపాదించినా, ఒక్కటీ మీకు దక్కదు.

ఈ విషయం పైకి వెళ్లాక తెలుసుకుంటే ఏ ప్రయోజనం లేదు, జీవించి ఉండగానే మీరు తెలుసుకోగలిగితే మీరు అంటే ఆత్మ ధన్యమైనట్టే. ఇది అర్థం చేసుకొని కనీసం ఇప్పటి నుంచి అయినా మేనుకు ప్రాముఖ్యం తగ్గించి, అంటే అవసరాలకు పరిమితం అయ్యి, 'నేను'కు ప్రాముఖ్యం ఇవ్వండి.

24 ఏళ్ల క్రితం పత్రిగారు పరిచయం అయ్యాక  నేను ఆత్మ అని తెలుసుకున్నాక, చాలా బాధపడడం జరిగింది. అప్పటికి నాకు 53 సంవత్సరాలు

ఎంత జీవితం వృధా అయిపోయింది. 'మేను' పరంగా చూస్తే కోట్లే సంపాదించాను, 'నేను' పరంగా చూస్తే 53 సంవత్సరాలలో సంపాదించింది జీరో.

నాకు మొదటి నుంచి కూడా అంటే ధన సంపాదన చేస్తున్నప్పుడు సమయం వృధా చేసేవాడిని కాదు. అందుచేత ఎంత డబ్బున్నా ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకునే వాడిని కాదు. ఇంటి దగ్గర ఉంటే వర్కర్స్ పని చేయకపోతే ఎంత నష్టమో అనిపించేది. వచ్చే డబ్బులు పోతాయి, వచ్చే ధనం పోతుంది అనిపించి వెంటనే బయలుదేరి వెళ్ళేవాడ్ని.

ఇప్పుడు కూడా అదే అలవాటయ్యింది ఎప్పుడైనా బద్ధకించి పడుకుందాము అంటే సంపాదించుకునే జ్ఞానం పోతుందేమో అనే భయంతో నాన్ స్టాప్‌గా తిరుగుతూ ఉంటాను. అప్పుడు ధనం కోసం తిరిగేవాడిని, ఇప్పుడు జ్ఞానం కోసం తిరుగుతున్నాను. పిల్లలు  ఇంటి దగ్గర మీకు ఏం లోటు?  ఇలా రైళ్ళలో తిరగకపోతే హాయిగా పడుకోవచ్చు కదా? అన్ని సౌకర్యాలున్నాయి,  ఏ ఇబ్బంది లేదు అని అంటారు. కానీ మాకు అలా ఇష్టం వుండదు. నన్ను చూసి మా మేడం కూడా తిరగడం మొదలు పెట్టింది, ఆవిడ కూడా అంతే!

ఏమో దేహం నేను అనుకుంటే ఏమన్నా కొంతసేపు పడుకుంటామేమో కానీ, ఆత్మ నేను అనుకుంటే మటుకు అసలు పడుకోలేము. పత్రిగారిని చూస్తున్నాం కదా? అలా తిరుగుతూనే ఉండేవారు, ఏదో పని చేస్తూనే ఉండేవారు.

అందుచేత ఈ వాక్యంలో ఎంత అర్థం ఉందో తెలుసుకోండి. **"అందరి కోసం బ్రతికినా మీకు దక్కింది ఏమిటి?"** ఆలోచించి ఈ కొటేషన్ గుర్తు పెట్టుకోండి, ఇప్పటి నుంచైనా మీ కోసం కృషి చెయ్యండి.

# “మనసును ఆత్మలో లయం చేయడమే మోక్షం”

ఇక్కడ చూడండి ఈ “శ్వాస మీద ధ్యాస” ధ్యానం చేసేటప్పుడు, మొదట్లో ఈ మనసు ఆలోచనలు లేని నిశ్చల స్థితికి చేరుకుంటుంది. అయినా సరే ధ్యానాన్ని మానకుండా కొనసాగిస్తూ, ఆహార నియమాలు కూడా పాటిస్తూ ఉంటే మెల్లిగా ఈ నిశ్చలమైన మనసు నిర్మలం అవుతుంది, అంటే శుద్ధి అవుతుంది, అంటే మంచిగా మారుతుంది. ఇక్కడ ఎన్నో లాభాలు వస్తాయి. అయినా సరే ఇంకా మానలేదు సాధన కొనసాగిస్తున్నారు. భీమవరం రావడం మానలేదు, జూమ్‌లో కూడా మానడం లేదు, ఈ “శ్వాస మీద ధ్యాస” ధ్యానాన్ని అలా కొనసాగిస్తూనే ఉన్నారు. కొన్ని సంవత్సరాల పాటు అలా చేసినప్పుడు మెల్లి మెల్లిగా ఈ నిర్మలమైన మనసు శూన్యం అవుతుంది. అయినా ఇంకా మీరు మానలేదు, ఇంకా కొన్ని రోజులకో నెలలకో ఆ మనసు ఇంకా శూన్యమై, పరిశూన్యం అవుతుంది. అయినా మీరు మానలేదు అలాగే కొనసాగిస్తున్నారు. ఇంత దీక్షగా చేస్తూ ఉంటే పరిశూన్యమైన మనసు, మహా పరిశూన్యం అవుతుంది. అంటే మనసు దాని ఉనికిని కోల్పోతుంది.

ఆ స్థితిలో ఆత్మలో లయం అయిపోతుంది. అంటే వాడు ముక్తిని పొందినట్టే అంటే మోక్షాన్ని పొందినట్టే.

ఈ మనోలయం గురించి ఉత్తరగీతలో శ్రీకృష్ణ భగవానుడు ఒక శ్లోకం ద్వారా చెప్పడం జరిగింది. ఏమిటంటే ఆ శ్లోకం;

**శ్లో॥ పూజా కోటి సమో స్తోత్రం స్తోత్ర కోటి సమో జపం**
**జపకోటి సమో ధ్యానం ధ్యానకోటి సమో లయ:**

అని చెప్పి శ్రీకృష్ణుల వారు చెప్పడం జరిగింది.

ఇక్కడ ధ్యానం దాకా అందరికీ అర్థమైంది. కానీ ధ్యానకోటి సమో లయ: అన్నదే కొంచెం అర్థం కాలేదు. లయము అంటే మనోలయం, మనసు ఆత్మలో లయం చెయ్యడం.

అది కోటి ధ్యానాలు చేయడం వల్ల సంభవిస్తుంది, జరుగుతుంది. ఆ స్థితికి చేరుకున్నవాడు అంటే మనసుని లయం చేసుకున్నవాడు మోక్షం పొందినట్టే. మనం ఇక్కడ ఈ శ్లోకం చెప్పుకుంటూ ధ్యానం యొక్క గొప్పతనాన్ని వివరించుకున్నాం.

కానీ ఈ ధ్యానంలో పరాకాష్టకు చేరితే మోక్షమే పొందగలుగుతాము అన్నది ఈ శ్లోకం ద్వారా శ్రీకృష్ణుల వారు బోధించడం జరిగింది.

మనం ఇంతకుముందు వివరించుకునే వాళ్ళం; పూజ కోటి సమం స్తోత్రం అని, అంటే కోటి పూజలు ఒక స్తోత్రానికి సమానం. అంటే మీరు ఒక గంట స్తోత్రం చెప్పినట్లయితే కోటి గంటలు పూజ చేసిన దాంతో సమానం. కోటి గంటలు అంటే ఒక జన్మ కూడా సరిపోదు, అంటే ఒక జన్మ జన్మంతా చేసిన పూజ ఒక గంట స్తోత్రంతో సమానం. దాన్ని బట్టి పూజకి స్తోత్రానికి ఎంత తేడా ఉందో అర్థం చేసుకోండి.

అలాగే కోటి స్తోత్రాలు ఒక జపానికి సమానమని అంటే నాన్ స్టాప్ గా ఒక జన్మ జన్మంతా స్తోత్రాలు చదివితే ఒక గంట జపంతో సమానం. అలాంటి జపాలు ఒక జన్మంతా చేస్తే వచ్చే ఫలితం ఒక గంట ధ్యానంలో వస్తుంది. దీన్ని బట్టి ధ్యానం ఎంత గొప్పదో మనం అర్థం చేసుకోవచ్చుని ఇంతమటికే చెప్పుకునే వాళ్ళం.

కానీ ఇంత గొప్పదైనటువంటి ధ్యానాన్ని కోటి చేస్తే అది “మనోలయానికి” దారి తీస్తుంది. మీరు చూడండి ఒక జన్మలో మీరు ఎక్కువ

టాప్ ప్రయారిటీ ఇచ్చి ఒక జన్మంతా ధ్యానం చేశారు అనుకుందాం ఒక జన్మంతా చేశారు.

ఈ జన్మ జన్మ అంతా చేసిన ధ్యానం యొక్క ఫలితం రావాలి అంటే జపంలో ఎన్ని జన్మలు చేయాలి అంటే కోటి జన్మలు చేయాలి. అదే స్తోత్రం ద్వారా రావాలంటే కోటి కోట్ల జన్మలు చేయాలి స్తోత్రాలు. పూజల ద్వారా రావాలి అంటే కోటి కోట్ల కోట్లు చేయాలి.

ఇప్పుడు చెప్పండి మీరు పూజలు చేస్తూ కూర్చుంటే మోక్షం వస్తుందా? స్తోత్రాలు చదువుతూ కూర్చుంటే మోక్షం వస్తుందా? జపాలు చేస్తూ కూర్చుంటే మోక్షం వస్తుందా? వేసుకోండి ప్రశ్న; అసాధ్యం అసంభవం. అటువంటి వాటి వల్ల మనసు లయం కాదు. మరి దేని వల్ల మనసు లయమవుతుంది. ధ్యానం వల్ల లయమవుతుంది. ఏ ధ్యానం వల్ల అవుతుంది "శ్వాస మీద ధ్యాస".

ఇంత శక్తివంతమైన ధ్యానం చేస్తేనే మనసును లయం చేసుకో గలుగుతారు. మనసును తప్పు అంచనా వేయకండి ఆశామాషీ కాదు. దాన్ని లయం చేయాలి అంటే యోగులు ఋషులు ఎంత కష్టపడ్డారో ఆలోచించండి. అందుకే నేను భీమవరం మానొద్దు అని చెప్పి చెప్పడానికి కారణం అదే! అంత దీక్షగా చేసే అవకాశం మనకి భీమవరంలోనే లభిస్తుంది.

ఈ మోక్షం గురించి రమణ మహర్షి గారు ఏమన్నారంటే: **"మనసును ఆత్మలో లయం చేయాలి"** అన్నారు. ఊరికే వచ్చేయదండి మోక్షం. మీరేదో ప్రార్థనలు, భజనలు, పూజలు చేసి ఆ దేవుని ప్రార్థిస్తే ఆయన ఇచ్చేది ఏం కాదు. మన అంతట మనం మన కృషి ద్వారా ఈ శ్వాస మీద ధ్యాస ద్వారా మనసును లయం చేసుకోగలిగితే మీరు మోక్షం పొందినట్టే!

ఇప్పుడు మనమంతా రకరకాల స్టేజ్‌లలో ఉన్నాం. ఇప్పుడు మనలో చాలామంది మనసును నిశ్చలం చేసుకున్నారు. అది కూడా సాధ్యం కాని వాళ్ళు కోట్ల మంది ఉన్నారు, ఇంకా చాలామంది ఈ మనసును నిర్మలం చేసుకున్నారు, భీమవరం వచ్చేవాళ్ళు చాలామంది ఈ స్టేజ్ దాకా సాధించారు.

ఇందులో కొంతమంది పరినిర్మలం చేసుకున్నారు. ఇంకా చాలా కొద్దిమంది మహా పరినిర్మలం కూడా చేసుకున్నారు. అంటే మనసు శూన్యం చేసుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నారు. అటువంటి వారు పట్టువదలకుండా ధ్యానం కొనసాగిస్తే వాళ్ళు మనసును శూన్యం కూడా చేసుకోగలుగుతారు.

మనసు శూన్యం అవుతూ ఉంటే వారిలో జ్ఞానం కూడా ఉదయిస్తూ ఉంటుంది. మనసు ఎంత శూన్యం అయితే వారిలో జ్ఞానం అంత పెరుగుతూ ఉంటుంది. అందుకే నేను ఏమంటానంటే భీమవరం మానొద్దు ఇక్కడ ప్రకృతి నిర్ణయం ప్రకారం ఈ అవకాశం మనందరికీ కలిగింది.

ఒక్క విషయం మీరు మర్చిపోకండి పత్రిగారు చెప్పినటువంటి అద్భుతమైనటువంటి సందేశం మర్చిపోకూడని సందేశం.

**"ఏది శాశ్వతం కాదు; అవకాశం ఉన్నప్పుడే సద్వినియోగం చేసుకోవాలి".**

ఇక్కడ అవకాశం ఉంటుంది. మీ శక్తి అలాగే ఉంటుందా? మీకు అన్ని అవకాశాలు ఉంటాయా? మీ కుటుంబంలో, మీలో ఎన్ని మార్పులు రావచ్చు అందుచేత అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడే తీవ్రాతి తీవ్ర సాధన చేసి మనసును ఆత్మలో లయం చేసుకోవాలి.

అంటే మోక్షాన్ని పొందండి, మీ జన్మను వృధా చేసుకోకండి. ప్రస్తుతం భూమిమీద ఉన్న ఎన్నో కోట్ల మంది 700-800 కోట్ల మందిలో ఈ అవకాశం

దొరికినటువంటి మీరు చాలా స్వల్పం. ఉండటానికి 800 కోట్లు ఉన్నారు. మోక్షం పొందాలని ఎంతమందికి ఉంటుంది? మోక్షం పొందాలనుకున్న ఎంతమందికి సద్గురువు లభిస్తాడు? సద్గురు లభించినా వారిలో ఎంతమందికి ఆ గురువు చెప్పింది ఆచరించే అవకాశం ఉంటుంది. అటువంటి వారిలో ఎంతమందికి ఇటువంటి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. అలాంటి వారేనండి మీరంతా! అందుచేత ఈ జన్మను వృధా చేసుకోవద్దు.

మీరు అనుకోవచ్చు వచ్చే జన్మ చూసుకుందాం అని. అది ఎప్పటికి వస్తాదో? ఎక్కడ పుడతారో? ఇన్ని అనుకూలమైనటువంటి వాతావరణం ఎక్కడ దొరుకుతాదో? ఎవరికి తెలుసండి? వచ్చిన దాన్ని చేజార్చుకొని, తర్వాత చూసుకుందాము అంటే ఏం చూస్తారండి?

ఈ మనసు లయం చేయడం గురించి "కల్కి భగవాన్" కూడా చెప్పడం జరిగింది. ఆయన ఏమన్నారంటే "మనసు బందీలో ఉన్న ఇంద్రియాలను మనసు బంది నుండి వినిపించడమే ముక్తి" అన్నారు.

ఇప్పుడు చూడండి ఈ జ్ఞానేంద్రియాలు కానీ, కర్మేంద్రియాలు కానీ మనసు అధీనం లోనే ఉన్నాయి మనసు ఎలా చెప్తే అలా పని చేస్తున్నాయి. మనసు మిమ్మల్ని మోక్షం వైపు నడిపించదు. అందుచేత, ఆ మనసును మీరు శూన్యం చేసుకోగలిగితే మనసే ఉండదు. ఇంక అది మిమ్మల్ని ఏం బంధించేస్తుంది? మనసు లేకపోతే ఇంకేముంటుందండి అంటారు. మనసు లేకపోతే ఉండేది ఆత్మ, భగవంతుడు. ఆ స్థితికి మీరు చేరుకుంటాడు. అలాంటి వాళ్ళనే మనం దేవుళ్ళు అంటున్నాం.

అలాగే "సత్య సాయిబాబా" వారు ఏమన్నారంటే; "దేహ భావం వదిలితేనే దైవ భావం కలుగుతుంది". మోక్షం అంటే నువ్వు దేవుడిగా

మారిపోవడమే మోక్షం. అది ఎవరికి సాధ్యం అవుతుంది? దేహ భావం వదలాలి. ఈ దేహ భావానికి కారణం ఎవరు మనసు.

అందుచేత ఆ బంధీలో ఉన్నంత కాలం ఆ భావంలో ఉన్నంత కాలం మీకు దుఃఖాలు ఉంటాయి. కానీ ఈ శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేస్తే మనసు శూన్యం అవుతే దేహ భావం పోతుంది.

అందుకే బుద్ధుడు ఆనాపానసతి ధ్యానం చేయమన్నాడు. ఈ ధ్యానం చేశాకనే ఆయనలోని మనసు లయమై దైవంగా మారగలిగాడు.

పత్రి గారు ఏమన్నారంటే ఓ సందర్భంగా; "ఆధ్యాత్మిక శాస్త్ర విజ్ఞాన అనుభవం ప్రకారంగా" ఒక గురువు చెప్పింది మరొక గురువు చెప్పిన దానికన్నా భిన్నంగా ఎప్పుడూ ఉండజాలదు.

ఏ లోకంలోనైనా, ఏ కాలంలోనైనా శాస్త్రజ్ఞానం అన్నది అంటే సత్యం అన్నది ఒక్కటిగానే ఉంటుంది. అందుకే

"ఏకం సత్ విప్రా బహుదా వదంతి" అన్నారు పెద్దలు. అంటే సత్యం ఒక్కటే కానీ దాన్ని వారి, వారి కోణాల్లో వివరిస్తారు, ఇదే పత్రి గారు చెప్పింది.

# "సత్యమే ఎప్పుడూ జయిస్తూ ఉంటుంది"

**"సత్యమే ఎప్పుడూ జయిస్తూ ఉంటుంది, అసత్యం అపజయం పాలు అవుతుంది".**

ఈరోజు ఒక ముఖ్య విషయం గురించి తెలుసుకుందాం. ముఖ్య విషయం అని ఎందుకు అన్నాను అంటే అది మర్చిపోకూడనటువంటి విషయం, నిరంతరము గుర్తుంచుకోవాల్సినటువంటి విషయం. ఎప్పుడైతే ఈ విషయాన్ని అంతలా గుర్తుంచుకుంటారో జీవితంలో దాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటారు, వారు అంతులేని లాభాన్ని పొందుతారు.

ప్రతి ఒక్కరు ఏమనుకుంటారంటే జీవితంలో నేను ఏం చేసినా జయం కలగాలి అని, ఫెయిల్యూర్ అవ్వకూడదు అని అనుకొంటారు. ఏది తలపెట్టినా, ఏది అనుకున్నా, ఏది చేసినా సక్సెస్ అవ్వాలనుకుంటారు. మరి అలా సక్సెస్ అవ్వాలి అంటే ఎవరు సక్సెస్ అవ్వగలరు? సత్యాన్ని ఆశ్రయించిన వారే సక్సెస్ అవుతారు.

అందుచేత ముందు సత్యం అంటే ఏమిటి? అసత్యం అంటే ఏమిటి? తెలుసుకుందాం.

సత్యం అంటే నిత్యమైనది, శాశ్వతమైనది, ఎల్లప్పుడూ ఉండేది, మార్పు చెందనిది, కాలమే కాదు యుగాలు మారినా కూడా మారనిది. అలాంటిది ఈ సృష్టిలో ఒక్కటే ఒకటి వుంది అదే భగవంతుడు, అదే ఆత్మ, 'ఆత్మే సత్యము.' 'అసత్యం' అంటే ఆత్మ కానివన్నీ అసత్యమే.

ఇంకా ఈ రెండింటికీ తేడా ఏమిటంటే! సృష్టింపబడనిది సత్యము, సృష్టిచేయబడింది అసత్యం.

కనపడనిదే 'సత్యము', కనపడేవన్నీ 'అసత్యము'! సత్యం అంత గొప్పది, భగవంతుడు అంత గొప్పవాడు, అంటే ఆత్మ అంత గొప్పది. ఇది మీరు అర్థం చేసుకుంటే ఎప్పుడూ 'సత్యాన్నే' ఆశ్రయిస్తారు, 'అసత్యం' మీద ఆసక్తి చూపించరు.

మీ అదృష్టం కొద్దీ మనందరి గురువు గారైనటువంటి పత్రి గారు 'సత్యాన్ని' ఆశ్రయించే అద్భుతమైనటువంటి మార్గాన్ని అందించారు. నిజంగా ఆయనే కనుక పరిచయం కాకపోతే 'సత్యం' అంటే ఏమిటో కూడా మనకు తెలియదు.

ఎందుచేతనంటే సృష్టిలో మీరు ఏది చూస్తున్నా, ఏది కనబడుతున్నా సమస్తము సత్యం నుంచే ఉద్భవించాయి. కోటాను కోట్ల లోకాలు కానీ, కోటాను కోట్ల జీవరాశులు కానీ అన్నీ సత్యం నుంచి ఉద్భవించినవే. అంటే అవన్నీ అశాశ్వతమైనవే, ఎప్పుడో ఒకప్పుడు అదృశ్యమయ్యేవే.

అందుచేత తెలివైన వారు ఏం చేస్తారు అంటే సత్యాన్నే ఆశ్రయిస్తారు. సత్యాన్ని ఆశ్రయించిన వారు పొందని లాభం అంటూ ఉండదు, తెలుసు కోలేనిదంటూ ఏదీ ఉండదు. సత్యాన్ని ఆశ్రయించడం వల్ల మీరు పొందేవన్నీ మీ కూడా వస్తాయి, దానివల్ల మీకు ఆనందం పెరుగుతుంది, ఎన్నో లాభాలు కూడా కలుగుతాయి.

ఎందుచేతనంటే సత్యం శాశ్వతం కాబట్టి, సత్యాన్ని ఆశ్రయించిన వారు పొందేవన్నీ శాశ్వతంగా ఉంటాయి. మీరు అసత్యాన్ని పొందినట్లయితే అశాశ్వతమైనవి పొందినట్టు, అవి ఎప్పుడో ఒకప్పుడుఅదృశ్యమైపోతాయి.

మీరు ఓ భార్యను పొందారు, లేకపోతే ఒక భర్తను పొందారు. భార్య అయినా, భర్త అయినా ఏదైతే సృష్టిలో సృష్టింపబడ్డాయో అవి అసత్యం

అని చెప్పుకున్నాం. మీరు గమనిస్తే ఈ అసత్యం పొందినప్పుడు చాలా సంతోషంగా ఉంటారు, కానీ అవి శాశ్వతం కాకపోవడం వల్ల ఎప్పుడో ఒకప్పుడు అవి మీకు దూరమవుతాయి.

అప్పుడు మీరు అంతులేని దుఃఖానికి లోనవుతారు, విలపిస్తారు, ఆ దుఃఖాన్ని తట్టుకోలేరు. కానీ మీరు పొందేటప్పుడే ఇవి శాశ్వతం కావు ఎప్పుడో ఒకప్పుడు ఇవన్నీ దూరమయ్యేవే అని గుర్తుంచుకొంటే మీకు ఆ దుఃఖం వుండదు. భార్యా, భర్త, మీ పిల్లలు, మీ సంపదలు, మీ పదవులు, మీ ఉద్యోగం, కనిపించేది ఏదైనా సరే అసత్యమే! అశాశ్వతమే.

అందుచేత పొందినప్పుడు తాత్కాలికంగా బాగానే ఉంటుంది. దూరమైనప్పుడు అంతులేని దుఃఖానికి లోనవుతారు. అందుకే అసత్యాన్ని పొందిన వారు, అసత్యం మీదే దృష్టి పెట్టిన వారు, అసత్యాన్ని సంపాదించాలనుకునే వారు చివరికి దుఃఖం పొందవలసిందే!

కానీ మీరు ఎప్పుడైతే 'సత్యాన్ని' పొందుతారో అది పొందినప్పుడు అనిర్వచనీయమైన ఆనందానుభూతిని పొందుతారు. అంత ఆనందం పొందిన వాళ్ళకు ఇక దేని మీద దృష్టి ఉండదు.

దేన్నైనా సరే దేనికోసం పొందాలని చూస్తారు? వాటి వల్ల వచ్చే సంతోషం వల్ల. సంతోషం ఎప్పుడూ అశాశ్వతం, ఆనందం ఒక్కటే శాశ్వతం. మనకి అలెగ్జాండర్ స్టోరీ! పత్రి గారు చెప్తూ ఉంటారు.

అలెగ్జాండర్ ప్రపంచాన్ని జయించాడు, అపారమైన సైన్యాన్ని పెంచుకున్నాడు, ఎన్నో రాజ్యాలు జయించాడు, తిరుగులేకుండా ప్రపంచమంతా పర్యటించాడు. అన్ని చేసి తిరిగి వెళ్ళేటప్పుడు దారిలో డయోజినిస్ అనే ఒక గొప్ప యోగిని కలిశాడు.

ఆయనతో మాట్లాడదాం అనుకుంటే డయోజనీస్ ముందు రానన్నాడు. చివరికి అలెగ్జాండర్ ఆయన దగ్గరికి వెళ్ళాడు. ఏంటి నువ్వు అంత గొప్పవాడివా? ప్రపంచానికే నేను చక్రవర్తిని, నేను కబురు చేస్తే ఎందుకు రాలేదు అన్నాడు. సరే నా గురించి చెప్తాను ముందు నీ గురించి చెప్పు అని డయోజనీస్ అన్నాడు.

అప్పుడు అలెగ్జాండర్ నేను ఈ ప్రపంచాన్ని జయించినటువంటి గొప్ప చక్రవర్తిని. నేను ఇప్పుడు ఎన్నో దేశాలు జయించి ఇక్కడ ఉన్న సంపదలన్నిటిని కొల్లగొట్టి నా రాజ్యానికి వెళ్తున్నాను అన్నాడు. అప్పుడు డయోజనిస్ అడిగాడు, ఇంతమందిని చంపి ఇంత ధనం తీసుకుని దేశానికి వెళ్తున్నానన్నావు, ఏం చేస్తావ్? అన్నాడు. నేను గొప్ప ప్యాలస్ కట్టి హాయిగా ఉంటాను అన్నాడు.

అప్పుడు డయోజనిస్ అన్నాడు నువ్వు హాయిగా సంతోషంగా ఉండడానికి ఇంత మందిని చంపావే! నేను ఏమీ చేయకుండా ఎప్పుడూ తృప్తిగా సంతోషంగా ఉంటున్నాను అన్నాడు. ఆయన ఇంకా నాకో సందేహం ఇన్ని చేశావు కానీ చివరికి నువ్వు నీ దేశం దాకా చేరుకుంటావో లేదో కూడా నాకు సందేహమే అన్నాడు.

డయోజనిస్ అన్నట్టు అలెగ్జాండర్ తన దేశం చేరే లోపులోనే చనిపోవడం జరిగింది. అంటే అశాశ్వతమైనవి ఎన్ని సంపాదించినా, అసత్యాలు ఎన్ని పోగేసుకున్నా అవి కూడా రావు, వాటి వల్ల ఆనందం ఉండదు.

అందుచేత పత్రి గారు ఏం చెప్తారంటే సత్యాన్ని ఆశ్రయించండి అంటారు. మన అదృష్టం కొద్దీ పత్రి గారు సత్యాన్ని ఆశ్రయించే అద్భుతమైన ధ్యాన సాధన ఇచ్చారు, అదే “శ్వాస మీద ధ్యాస”. ఎప్పుడైతే మీరు “శ్వాస

మీద ధ్యాస" ధ్యానం చేస్తారో మీరు సత్యాన్ని ఆశ్రయించిన వారు అవుతారు, ఆత్మను ఆశ్రయించిన వారు అవుతారు.

అప్పుడు అన్ని విషయాల్లో మీరు విజయం సాధిస్తారు. ఎందుచేత నంటే ఇక్కడ చూడండి, కళ్ళు మూసుకున్నప్పుడు శరీరం లోపల ఉంటారు, అప్పుడు ఆలోచనలు వస్తాయి, ఆలోచనలు కట్ చేసి "శ్వాస మీద ధ్యాస" వుంచినప్పుడు మనసు కూడా ఆగిపోతుంది. అక్కడ ఆత్మ అంటే 'సత్యం' ఒకటే ఉంటుంది.

అప్పుడు మీరు 'సత్యాన్ని' ఆశ్రయించిన వారు అవుతారు. 'సత్యాన్ని' ఆశ్రయించిన వారికి ఎప్పుడూ జయమే, ఆనందమే, ఆరోగ్యమే.

అందుకే చూడండి అందరూ ఇన్ని హాస్పిటల్స్ మధ్యలో ఉంటున్నారు, కానీ ఏదో ఒక రోగంతో ఇబ్బంది పడుతున్నారు. కానీ ఋషులు, మహర్షులు, యోగులు, బాలయోగులు హిమాలయాల్లోనో, అడవుల్లోనో, ఆశ్రమాల్లో ఉంటారు. వాళ్ళకి ఏ జబ్బు ఉండదు. సాధన చేసుకుంటూ ఆనందానుభూతిలో ఉంటారు అంతకన్నా ఏం కావాలి.

అన్నీ ఉన్నా మీకు రోజూ దుఃఖమే! దాని గురించి, దీని గురించి, అది అవ్వలేదని, ఇది అవ్వలేదని, వారికి అది జరగలేదని, వీడికి ఇది జరగలేదని బాధపడుతూ వుంటారు. కానీ ఆ సాధకులు ఎప్పుడూ ఆనందంగా ఉంటారు.

అందుచేత మీ అదృష్టం కొద్దీ సత్యాన్ని ఆశ్రయించే సాధన పత్రిగారు ఇవ్వడం జరిగింది. కానీ "శ్వాస మీద ధ్యాస" తప్ప ఇంకే రకమైన ధ్యానం చేసినా వారు అసత్యంతోటే ఉంటారు. అసత్యాన్ని ఆశ్రయించిన వారు తాత్కాలికంగా కొన్ని లాభాలు పొందినట్టు కనిపించవచ్చు కానీ చివరికి వాళ్ళు అపజయం పాలవుతారు.

అందుచేత సత్యాన్నే ఆశ్రయించాలి. మరి ఈ విషయం పత్రి గారు ఒకసారి భీమవరం వచ్చినప్పుడు కూడా చెప్పడం జరిగింది. ఆయన ఏం చెప్పారంటే;

"ఎక్కడ సత్యం ఉందో అక్కడికి వచ్చారు, మీరు సత్యం దగ్గరికి వెళ్తే మీరు కూడా సత్యం అవుతారు. మీరు సత్యం అయితే మీ దగ్గరికి వచ్చేవాళ్ళు కూడా సత్యం పొందుతారు, సత్యం నుంచి ఆరోగ్యము, ఆనందం, సంతోషము.

అసత్యంలో ఆరోగ్యం ఉంటుందేమిటి? సత్యంలో ఆరోగ్యం ఉన్నప్పుడు అసత్యంలో అనారోగ్యం ఉంటుంది, సత్యంలో ఆనందం ఉంటుంది, అసత్యంలో దుఃఖం ఉంటుంది.

"సత్యమేవ జయతే" అన్నది ఉపనిషత్ వాక్యం. సత్యమేవ అంటే సత్యం మాత్రమే, జయతే అంటే జయిస్తుంది, అసత్యం ఎప్పుడు అపజయంగానే ఉంటుంది అన్నారు.

అందుకే నేను ఎవరు ఎన్ని చెప్పినా ఎన్ని అన్నా ఎంతమంది ఎన్ని విమర్శలు చేసినా ఈ "శ్వాస మీద ధ్యాస" వదలలేదు. ఎందుకంటే నాకు అర్థమైంది, "శ్వాస మీద ధ్యాస" ద్వారా మాత్రమే మనం సత్యాన్ని ఆశ్రయించ గలుగుతాం.

అది కాకుండా మీరు మ్యూజిక్ పెట్టుకున్నా, గైడింగ్లు చేసినా, సంకల్ప ధ్యానాలు చేసినా, ఎన్ని రకాలు చేసినా అసత్యమైన మనసు దగ్గరే ఆగిపోతారు. అదేదో తాత్కాలికంగా తృప్తి కలిగించొచ్చు, కానీ చివరికి వాళ్ళు అపజయం పాలవుతారు, అసలు మళ్ళీ కనబడరు, ఎలా అదృశ్యం అయిపోతారో తెలియదు.

అందుచేత సత్యం యొక్క గొప్పతనం నేను తెలుసుకున్నాను కాబట్టే ఈ "శ్వాస మీద ధ్యాస" వదలకుండా పట్టుకోవడానికి కారణం. మరి అంతలా

పట్టుకున్నాను కాబట్టే నేను కానీ, మేడం కానీ ఇన్ని పుస్తకాలు వ్రాయగలిగాం, ఇన్ని వీడియోలు చేయగలిగాం, ఇన్ని చోట్ల తిరగగలుగుతున్నాం,ఇన్ని చెప్పగలుగుతున్నాం.

ఎక్కడికి వెళ్ళినా ఆవిడ నోటి వెంట ఏవో కొత్త విషయాలు వస్తాయి, నా నోటి వెంట ఏవో కొత్త విషయాలు వస్తాయి. కారణం సృష్టిలో జ్ఞానం అనంతం, అనంతమైన జ్ఞానాన్ని సత్యాన్ని ఆశ్రయించిన వారే చెప్పగలరు, బోధించగలరు. నేను అందుకే మిమ్మల్ని కూడా భీమవరం మానకుండా రండి, మార్నింగ్ జూమ్ మానకుండా కూర్చోండి, సత్యాన్ని ఆశ్రయించండి అని చెప్తాను.

ఏమండీ బ్రహ్మ ముహూర్తంలో రెండున్నర గంటలు! సత్యాన్ని ఆశ్రయించడానికి మంచి అవకాశం!రోజులో మిగతా 22 గంటలు దేనికైనా కేటాయించుకోండి . సత్యాన్ని ఒక రెండున్నర గంటలు ఆశ్రయించలేరా? ఆశ్రయించలేకపోతే మీకంటే దురదృష్టవంతులు ఎవరు చెప్పండి? నెలలో 30 రోజులు ఉంటే మూడు రోజులు భీమవరం కేటాయించలేరా?

అదే మళ్ళీ చెప్తున్నాను “సత్యమే ఎప్పుడూ జయిస్తుంది, అసత్యం అపజయం పాలవుతుంది”. మర్చి పోకండి, వేదాల్లో ఉన్నటువంటి సందేశమే ఇది.

# "పంచింది పెంచబడుతుంది"

ఈ విషయాలను ఎందుకు ముఖ్యమైనవి అనుకున్నామంటే, ఇవి నిరంతరం, నిత్యం  గుర్తుంచుకోవాల్సినవే. అవి మీ జీవితంలో సహజ స్వభావంగా మారిపోవాలి. అప్పుడు ఎవరైనా సరే ఆధ్యాత్మికంగా గొప్ప స్థితికి ఎదుగుతారు.

ఎవరు ఆధ్యాత్మికంగా ఎదుగుతారో వారు దుఃఖం నుండి బయట పడతారు. అంతేకాకుండా వారు జ్ఞాన పరంగా కూడా ఎదుగుతారు, ఇహ లోకంలో వారికి గౌరవం ఉంటుంది. అలా ఎదిగిన వారిని చాలా మందిని చూస్తున్నాం. అలాగే పర లోకంలో కూడా ఉన్నత స్థితిని చేరుకుంటారు, కేవలం ఉన్నత లోకాలను చేరడమే కాకుండా, మెల్లగా జీవిత లక్ష్యాన్ని సాధించగలుగుతారు, చివరికి ప్రతి ఒక్కరూ సాధించవలసింది ఇదే.

ఇంకొక ముఖ్యమైన విషయాన్ని తెలుసుకుందాం.  "పంచింది పెంచబడుతుంది"

ఈ విషయాన్ని నేను పత్రి గారి దగ్గర తెలుసుకున్నాను. ఆయన దగ్గర తెలుసుకున్న  ఈ చిన్న వాక్యం నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది, ఎంతో లాభాన్ని కలిగించింది, నన్ను చాలా ఆలోచింపజేసింది.

లోకంలో ప్రాపంచికంగా జీవించే వారు ఉన్నారు, ఆధ్యాత్మికంగా జీవించేవారు కూడా ఉన్నారు. ప్రాపంచిక లాభాలు కోరుకునే వారు ఉన్నారు, ఆధ్యాత్మిక లాభాలు కోరుకునే వారు కూడా ఉన్నారు. ప్రాథమిక జన్మలలో ఉన్నవారు ప్రాపంచిక లాభాలను కోరుకుంటారు, చివరి జన్మలలో చేరుకున్నవారు ఆధ్యాత్మిక లాభాలను కోరుకుంటారు, కానీ సృష్టిలో ఉన్న ఈ

సూత్రం అందరికీ వర్తిస్తుంది.

ప్రతి ఒక్కరి ఆత్మ స్థితిని బట్టి వారి కోరికలు ఉంటాయి. ప్రాపంచికంగా సంపాదించుకోవాలనుకునేవారు ఉంటారు, ఆధ్యాత్మికంగా సంపాదించుకోవాలనుకునేవారు కూడా ఉంటారు.

ప్రాపంచికంగా ధనం కావాలనుకుంటారు, ఆధ్యాత్మికంగా జ్ఞానం కావాలనుకుంటారు. ప్రాపంచికంగా ధనం పెంచుకుంటే గొప్పవాడని అనుకుంటారు, ఆధ్యాత్మికంగా జ్ఞానం పెంచుకుంటే గొప్పవాడని అనుకుంటారు.

కానీ ఎవరికైనా ఒకే సూత్రం వర్తిస్తుంది. ఏదైనా పెరగాలంటే పంచాలి, పంచకుండా ఎవరూ ఏదీ పొందలేరు. లోకంలో సహజంగా కోరుకోవడం అలవాటు అయిపోయింది, కానీ కోరుకుంటే అది పెరగదు, పంచితేనే అది పెరుగుతుంది.

ప్రాపంచికంగా చూస్తే ఆర్థికంగా చాలా స్థాయిల్లో మనుషులు ఉంటారు. పేద వారి నుండి కోటీశ్వరుల వరకు ఉంటారు, వారు గతంలో పంచిన దాన్ని బట్టి వారి ప్రస్తుత జీవితం ఉంటుంది. ఉన్నదానితో సంతృప్తి లేనప్పుడు ఇంకా పెంచుకోవాలంటే తప్పనిసరిగా పంచాలి. ఈ సృష్టి రహస్యాన్ని అర్థం చేసుకున్నవారు ఉన్నదాంట్లో పంచి పెంచుకుంటారు.

అలాగే ఆధ్యాత్మికంగా కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. గతంలో పంచిన జ్ఞానం ఆధారంగా ప్రస్తుత జ్ఞాన స్థితి ఉంటుంది. ఇంకా జ్ఞానం పెంచుకోవాలంటే పంచాలి, దానికి ఉదాహరణగా మా ఇద్దరి అనుభవమే. మేము ఇరవై సంవత్సరాల క్రితం చెప్పిన విషయాలు ఇప్పుడు వింటే మాలో ఎంత మార్పు వచ్చిందో తెలుస్తుంది, మాలో ఎంత ఎదుగుదల వుందో

అర్థమవుతుంది.

మీ అందరిలో కూడా ఇదే మార్పు నేను గమనించాను. ఐదు లేదా పది సంవత్సరాల క్రితం మీ జ్ఞానం ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో చూస్తే చాలా మార్పు కనిపిస్తుంది. ఈ మార్పు ఎందుకు వచ్చింది అంటే, మీరు ఈ సూత్రాన్ని పాటించడం వల్లే. మీరు కూడా పొందిన జ్ఞానాన్ని పంచే ప్రయత్నం చేస్తున్నారు. సందేశాల ద్వారా, పుస్తకాల ద్వారా, సేవల ద్వారా ఇతరులకు జ్ఞానాన్ని పంచుతున్నారు, దాని ఫలితంగా మీలో కూడా మార్పు కనిపిస్తుంది.

పత్రి గారి పరిచయం అయినప్పుడు "నేను ఆత్మను" అని నాకు తెలిసింది. ఆత్మకు లాభం కలిగించేది జ్ఞానమే అని అర్థమైంది, ఎంత జ్ఞానం ఉంటే వాడు అంత గొప్పవాడని తెలుసుకున్నాను. అయితే జ్ఞానం పెంచుకోవాలంటే ఏమి చేయాలి? అని ఆలోచిస్తే, దానికి తేలికైన మార్గం పంచడమే అని పత్రి గారి సందేశం ద్వారా తెలుసుకున్నాను.

ఆ రోజు నుండి "శ్వాస మీద ధ్యాస" పెట్టి ధ్యానం చేయడం ప్రారంభించాము, ఆత్మజ్ఞానం బోధించే పుస్తకాలు చదవడం, సందేశాలు వినడం ప్రారంభించాము, మేము పొందిన జ్ఞానాన్ని వీలైనంతగా ఊరూరా తిరిగి పంచుతున్నాము. మా సమయం, శక్తి, వాక్కు, వనరులను ఈ సేవకే వినియోగిస్తున్నాము.

ఇతరులకు జ్ఞానం పంచడానికి ఇంద్రియ శక్తులను కూడా ఉపయోగిస్తున్నాము, దాని ఫలితంగా మాలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే మీ అందరికీ చెబుతున్నాను మీరు ఎంత తెలుసుకుంటే అంత పంచండి, అవకాశం ఉన్న చోట క్లాసులు చెప్పండి. త్వరగా జ్ఞానం

పెంచుకోవాలంటే ఇదే సులభమైన మార్గం. ముందు జ్ఞానం సంపాదించండి, తర్వాత దాన్ని పంచండి.

అయితే పంచడంలో స్వార్థం ఉండకూడదు అంటే లాభాపేక్ష ఉండకూడదు. ఈ ప్రపంచంలో ధ్యాన మార్గంలో ఉన్నవారు చాలా తక్కువ మంది మాత్రమే ఉంటారు.

ఆ మార్గంలో ఉన్నవారిలో కూడా జ్ఞాన మార్గంలోకి వచ్చే వారు చాలా కొద్దిమంది మాత్రమే. అలాంటి వారిలో మీరు ఒకరు, కాబట్టి ఇతరులతో పోల్చుకోవద్దు.

మీకు ఏది కావాలో దాని కోసం ఈ సూత్రాన్ని పాటించండి. మీరు సుఖంగా ఉండాలంటే ఇతరుల సుఖం కోసం కృషి చేయండి. మీరు సంతోషంగా ఉండాలంటే ఇతరులను సంతోషపరచండి, మీరు ఆనందంగా ఉండాలంటే ఇతరులను ఆనందింపజేయండి. అలాగే మీరు ధ్యానంలో ఎదగాలంటే అందరికీ ధ్యానం పంచండి, మీరు శాంతిగా ఉండాలంటే అన్ని ప్రాణులు శాంతిగా ఉండేలా చూడండి. మీకు నచ్చనిది ఇతరులకు చేయవద్దు, మీకు కావలసిన దాన్ని ఇతరులకు ఇవ్వండి.

అప్పుడు మీ జీవితం మెల్లగా ఎలా మారుతుందో మీరు చూడగలుగుతారు, కాబట్టి  ఏది పెరగాలన్నా పంచాలి అనే విషయాన్ని గుర్తుంచుకోండి.

# “ఈ సృష్టిలో ఏదీ శాశ్వతం కాదు”

మీ జీవితం సరైన విధంగా సాగాలంటే, ఒడిదుడుకులు లేకుండా సాగాలంటే సృష్టిలో ఉన్న కొన్ని ముఖ్యమైన విషయాలు దృష్టిలో ఉంచుకొని అవి పాటిస్తూ జీవించాలి. ఎందుచేతనంటే ఈ విషయాలన్నీ ఎంతో అనుభవజ్ఞులైన పెద్దలు యోగులు బోధించినవి. అవే ఇప్పుడు మీరు తెలుసుకుంటున్నారు.

**“ఈ సృష్టిలో ఏది శాశ్వతం కాదు”**

ఇది అర్థం చేసుకొని మీ జీవితంలో అన్వయించుకుంటే జీవితంలో దుఃఖం కలగదు. ముఖ్యంగా మీ విషయంలోనే మీరు చూసుకుంటే ముందు బాల్యావస్థలో ఉండేవారు. అదే రకంగా ఎప్పుడూ ఉన్నారా? అంటే లేదు కొన్నాళ్ళకి ఆ అవస్థ మారిపోయి యవ్వనావస్థ వస్తుంది.

అదైనా శాశ్వతంగా ఉందా? అంటే కొన్నాళ్ళకి అదీ పోతుంది. కౌమారావస్థ వస్తుంది, అదైనా శాశ్వతంగా ఉంటుందా? అంటే అది ఉండదు. కొన్నాళ్ళకి అది పోయి వృద్ధాప్యం వస్తుంది, అది శాశ్వతంగా ఉండదు. కొన్నాళ్ళు ఉండి ఆ జీవితమే అయిపోతుంది.

ఒకప్పుడు ఉన్న మీరు ఏమయ్యారో తెలియదు. ఎవరిని చూసినా అంతే! ఎవరు శాశ్వతం కాదు, ఎవరి జీవితము శాశ్వతం కాదు. మీరు గమనించండి యవ్వనంలో ఉన్నప్పుడు స్త్రీ ఎంతో అందంగా ఉంటుంది, ఆకర్షణగా ఉంటుంది. ఆ సమయంలో స్త్రీలు ఎంతో గర్వంతో, అహంకారంతో విర్రవీగిపోతూ ఉంటారు.

విచిత్రం ఏమిటంటే చూస్తూ ఉండగానే యవ్వనం పోయి వార్ధక్యం వస్తుంది, ఆ అందం ఉండదు, పూర్తిగా మారిపోతుంది. అందరిలో ఫోజు

కొట్టిన వాళ్ళ ఆకారం వాళ్ళకే అసహ్యంగా కనిపిస్తుంది. అప్పుడు వారు బయట కనిపించడానికి ఇష్టపడరు, రారు కూడా! సడన్ గా వాళ్ళని చూసిన వాళ్ళు ఎంతో ఆశ్చర్యపోతారు, ఏంటి వీళ్ళు ఇలా అయిపోయారు అని.

ముఖ్యంగా మీరు సినిమా యాక్టర్స్ ని చూస్తే ఇది అర్థమవుతుంది. వారు ఒకప్పుడు ఎంత అందంగా ఉండేవారు ఇప్పుడు ఎలా ఉన్నారు? అని రెండు ఫోటోలు యూట్యూబ్‌లో వేస్తున్నారు.

వైజయంతిమాల, హేమమాలిని, జమున లాంటి వాళ్ళని చూస్తే అప్పుడు వున్న అందము, యవ్వనమూ లేదు. అంటే ఏది శాశ్వతం కాదు అని తెలుస్తుంది. అలాగే పురుషులు యవ్వనంలో మంచి కండలతో పుష్టిగా, సౌష్టవంగా ఉంటారు, గర్వంతో వాడెంత, వీడెంత అంటారు. కొన్నాళ్ళకి కండలు కరిగిపోతాయి, శరీరం వంగిపోతుంది, మాటలు తడబడతాయి, కంటి చూపు తగ్గిపోతుంది, చెవులు కూడా వినపడవు, శరీరం ముడతలు పడుతుంది. అంటే ఏది శాశ్వతం కాదని తెలుస్తుంది, ఎవరిని చూసినా అంతే!

ఇది అర్థమైనవాడు ఉన్నప్పుడు గర్వపడడు, అహంకరించడు. స్త్రీలు తమ అందం చూసుకొని విర్ర వీగరు. శాశ్వతం కాని దాని గురించి విర్రవిగేదేంటి? అలా విర్ర వీగినోళ్ళే జుట్టు తెల్లబడితే రంగు వేసుకోవడానికి నానా తిప్పలు పడతారు !

అలాగే వాళ్ళకు ఉన్న ఉద్యోగం చూసి, వారి అధికారం, పెత్తనం చూసి భూమ్మీద ఉండరు. కానీ కొన్నాళ్ళకి రిటైర్ అయిపోతాడు, అంటే పదవి శాశ్వతమా? అంటే అది శాశ్వతం కాదు. కొంతమంది వ్యాపారం చేసి బాగా డబ్బు సంపాదిస్తారు, నా ప్రతిభే అని గర్విస్తాడు. కొన్నాళ్ళకి వాడి పిల్లలు బయలుదేరుతారు, వీడికి ఓపిక తగ్గిపోయి పిల్లల చేతిలో పెడతాడు, వాళ్ళు ఉన్నదంతా తగలేస్తారు, అప్పుడు చూడండి వాడి ఏడుపు.

అందుచేత పదవులు కానీ, ఉద్యోగాలు కానీ, వ్యాపారం కానీ, ఆస్తులు కానీ ఏది చూసినా గర్వించడానికి, అహంకరించడానికి ఏమీ లేదు. అందుకే పత్రి గారు **"వస్తే రాని, ఉంటే ఉండని, పోతే పోని".** అంటారు. అంటే **"వచ్చిందని సంబరపడకు, ఉందని ధీమా ప్రదర్శించకు, పోయిందని బాధపడకు"** అంటారు.

సదానంద యోగి గారు బోధించినటు వంటి ఒక గొప్ప సందేశం ఏమిటంటే;

**కోరి సాధించరాదు, కోరక వచ్చింది కాదనరాదు**
**వస్తూ ఉంటే వస్తూ ఉందని సంబరపడరాదు.**
**పోతూ ఉంటే పోతుందని బాధపడరాదు.**

కోరి సాధించరాదు అంటే చాలామంది చాలా కోరుకుంటారు ఇంకా కొంతమంది సంకల్పాలు పెడతారు, ఇంకా కొంతమంది ఎంత కోరుకున్నా రావట్లేదని అక్రమ మార్గాల ద్వారా ప్రయత్నిస్తారు, అధర్మంగా, అన్యాయంగా, అక్రమంగా సంపాదించాలని ప్రయత్నిస్తారు.

కానీ ఆ రకమైన సృష్టి విరుద్ధమైన పనుల ద్వారా, అధర్మంగా సంపాదించడం వల్ల భవిష్యత్తులో సంపాదించింది కోల్పోవడమే కాదు తాను ఇంకా ఎక్కువ నష్టపోవాల్సి వస్తుంది.

ఇది మనం మహాభారతంలో చూశాం. దుర్యోధనుడు అధర్మంగా మాయాజూదంలో పాండవుల రాజ్యం సంపాదించుకున్నాడు, కానీ తర్వాత జరిగిన యుద్ధంలో తాను తన వారందరినీ కోల్పోవడమే కాదు, తన రాజ్యాన్ని కూడా కోల్పోవలసి వచ్చింది. ఎందుకు జరిగింది అంటే అధర్మంగా ప్రవర్తించడమే!

అందుచేత మీరైనా సరే సంపాదించండి కానీ అధర్మంగా

సంపాదించవద్దు. కొంతమంది అడగొచ్చు, ఈ రోజుల్లో ధర్మంగా ఎక్కడ సంపాదించగలమండి అని ఉద్యోగం చేసేవాళ్ళు కూడా అంటారు! నేను ధర్మంగా ఉద్యోగం చేయాలి అంటే నా పై ఆఫీసర్ ఒప్పుకోవట్లేదు అంటారు.

పైగా నా భార్యకు కూడా నేను లోకువైపోయాను! మీ వాళ్ళంతా అపార్ట్మెంట్లు అన్ని కొంటుంటే వాళ్ళ కంటే పెద్ద ఉద్యోగం చేస్తున్నావు నువ్వేంటి ఇలా ఉన్నావు అంటారు. ధర్మంగా ఉంటే రిలేషన్ పోవడమే కాదు, ధర్మంగా ఉన్నాడని  మెచ్చుకుంటారా? అంటే అదీ ఉండదు.

అలా నా జీవితంలో చాలా మందిని చూడడం జరిగింది ఆ రకంగా సంపాదించినప్పుడు తాత్కాలికంగా బాగానే అనిపించింది కానీ చివరకు వారి జీవితం చాలా దుఃఖమయం కావడం నేను చూశాను.

అలాగే కొంతమంది ధర్మంగా సంపాదిస్తూ  కష్టపడుతూ జీవించే వారు. వారి పిల్లలు మంచి పొజిషన్ లోకి వెళ్ళిపోయారు. అప్పుడు నాకు అనిపించింది, వారి ధర్మమే వారిని  కాపాడింది అని.

ఇవన్నీ ఎందుకు చెప్తున్నాను అంటే సదానంద యోగి చెప్పినటువంటి సందేశం మీకు అర్థం కావాలని. ఆయన ఏమన్నారంటే! “కోరి సాధించరాదు”, అంటే ఎవ్వరిని అడగ కూడదు, అధర్మంగా సంపాదించాలని చూడకూడదు. నువ్వు గతంలో చేసుకున్న దాన్ని బట్టి ఏది రావాలో, ఎంత రావాలో అంతే వస్తుంది.

ఆయన ఇంకోకటి చెప్పారు” కోరక వచ్చింది కాదనరాదు” అన్నారు. నీకు అనుకోకుండా కలిసి వచ్చింది, దాన్ని కాదనవలసిన పనిలేదు. నువ్వు అడగకుండా నీకు సహాయం చేశారు దాన్ని నువ్వు కాదనక్కర్లేదు అన్నారు.

ప్రకృతి నీ అర్హతను బట్టి నీకు ఎంత సమకూర్చాలో అంతా సమకూరుస్తుంది. చాలామంది అడుగుతారు! వాళ్ళు ఇస్తున్నారు నేను

తీసుకోవచ్చా?  అంటే వాళ్ళంతట వాళ్ళు ఇచ్చినప్పుడు వద్దు అని అనక్కరలేదు అని తెలుసుకోవాలి.

ఒకవేళ అవసరానికి మించి నీకు ఇస్తే దాన్ని మళ్ళీ పంచు. ఇది నేను పత్రిగారి దగ్గర గమనించాను, ఆయన ఇలా తీసుకుంటారు అలా ఇచ్చేస్తారు.

అలాగే ఆయన "వస్తూ ఉంటే వస్తుందని సంబరపడరాదు" అన్నారు. అంటే నీకు లాభాలు రావచ్చు దాని కోసం సంబరపడవలసిన పని ఏం లేదు, కారణం నువ్వు అర్హత సంపాదించు కున్నావు ఆటోమేటిక్ గా వస్తుంది.

అలాగే "పోతూ ఉంటే పోతుందని బాధపడరాదు" అని అన్నారు. శంకరాచార్యుల వారు చెప్పారు కదా ఏదైనా కర్మ బంధాన్ని బట్టే ఉంటాయి, బంధం తీరిపోతే అన్నీ పోతాయి దానికి బాధపడవలసిన పనిలేదు అని తెలుసుకోవాలి.

నిన్నటి దాకా ఉంది ఇవాళ పోయింది.  అందుచేత వస్తే రావచ్చు, పోతే పోవచ్చు. వచ్చినా చేయవలసింది ఏం లేదు, పోయినా ఏడుస్తూ కూర్చోవల్సింది పని లేదు. ఒకటే గుర్తుపెట్టుకోండి ఉన్నది కూడా శాశ్వతం కాదు, తాత్కాలికంగా నీ అర్హతను బట్టి నువ్వు ఉపయోగించుకోవడానికి ఇవ్వబడింది. దాన్ని ఉపయోగించుకుంటూ ఉన్నదాన్ని 10 మందికి ఉపయోగపడే పనులకు ఉపయోగించు, అదే నువ్వు చేయవలసింది.

ఆ రకంగా ఎవరు ప్రవర్తించగలరు? అంటే "ఈ సృష్టిలో ఏదీ శాశ్వతం కాదు" అని తెలుసుకున్న వాళ్ళు. అందుచేత పెద్దలు చెప్పినటువంటి సందేశాలు సామాన్యంగా తీసిపడేసేవి కాదు. అవి మీకు అర్థం కావాలంటే మీ బుద్ధి బాగా వికసింప చేసుకోవాలి. మీ బుద్ధి ఎంత పెరిగితే ఈ విషయాలన్నీ అంత బాగా అర్థమవుతాయి.

# "కోరికలు తీర్చుకునేవాడు గొప్పవాడు కాదు, కోరికలు అదుపు చేసుకున్న వాడే గొప్పవాడు."

ప్రతి మానవుడికి మనసు ఉంటుంది, మనసు ఉన్నచోట ఆలోచనలు ఉంటాయి, ఆలోచనలు ఉన్నచోట కోరికలు తప్పకుండా పుడతాయి. కోరికలు మనిషి సహజ స్వభావం, కానీ ఈ కోరికల స్వభావం ఎలా ఉంటుందో మీరు గమనించాలి.

ఒక కోరికను మీరు తీర్చుకున్న వెంటనే, మరొక కోరిక పుడుతుంది. ఆ కోరికను తీర్చుకున్నాక మళ్ళీ ఇంకొక కోరిక వస్తుంది. ఎందుకంటే కోరికలు తీర్చుకోవడం వల్ల తగ్గవు, మరింత పెరుగుతాయి. కాని ప్రతి కోరికను తీర్చుకోవడం ఎవరికి సాధ్యం కాదు, కొన్ని కోరికలను మీరు సులభంగా తీర్చుకోగలుగుతారు, కానీ మరికొన్ని కోరికలు తీర్చుకోలేరు.

కొన్ని కోరికలు మానవుడి శక్తికి మించినవిగా ఉంటాయి. అలాంటి కోరికలను మనిషి తీర్చుకోలేడు, కానీ ఆ కోరికలు తీరకపోతే, అతడు ఎంతో దుఃఖానికి లోనవుతాడు, అశాంతికి గురవుతాడు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించాలి "కోరిక మనసుకు చెందినది". అందుకే, మనసు ఆ కోరికను సులభంగా వదలదు, తీర్చుకోలేని కోరిక అయినప్పటికీ, "ఎలాగైనా దాన్ని సాధించాలి" అనే పట్టుదల మానవుడిలో పెరుగుతుంది.

ఆ కోరికను తీర్చుకోవడానికి మనిషి చేయకూడని పనులు, తప్పులు చేస్తాడు, పాపాలు కూడా చేస్తాడు. అందువల్ల తాత్కాలికంగా కోరిక తీరినా, దాని ఫలితంగా జీవితంలో కష్టాలు, దుఃఖం కలుగుతాయి. అలాగే ఈ కోరికల వల్ల కుటుంబంలో గొడవలు జరుగుతూ ఉంటాయి. కుటుంబంలో కలహాలు జరుగుతున్నాయంటే దానికి ముఖ్య కారణం కోరికలే.

భార్య కోరిన కోరికలను భర్త తీర్చకపోతే గొడవ జరుగుతుంది,

అలాగే భర్త కోరికలు భార్య కాదన్నా గొడవ జరుగుతుంది. అలాగే తల్లి దండ్రులకు, పిల్లలకు కూడా అలాగే కోరికలు ఉంటాయి. మొదట్లో తల్లి దండ్రులు పిల్లలపై ప్రేమతో, అనురాగంతో, ఇష్టంతో వాళ్లు అడగకపోయినా ఎన్నో వస్తువులు ఇస్తూ ఉంటారు. ఇది ప్రేమతో చేసిన పని అయినప్పటికీ, పిల్లలలో ఒక అలవాటుగా మారుతుంది. ఆ అలవాటు పెరిగే కొద్దీ, పిల్లలు "తల్లిదండ్రులు ఇస్తున్నారు కదా" అనే భావంతో, మరిన్ని కోరికలు కోరడం ప్రారంభిస్తారు. వారు ఎదిగే కొద్దీ వారి కోరికలు కూడా పెరుగుతూనే ఉంటాయి. ఎలిమెంటరీ స్కూల్‌లోనే సెల్‌ఫోన్ కావాలి అంటారు. ఇవ్వకపోతే అక్కడే గొడవలు మొదలవుతాయి. ఇలా గమనిస్తే, కోరికలు ఎలా చిన్న స్థాయిలో మొదలై, క్రమంగా పెద్ద సమస్యగా మారుతాయి.

ఈ కోరికలను తీర్చుకోవడానికి మానవుడు కేవలం సంపాదించడమే కాదు, కొన్నిసార్లు అధర్మంగా కూడా వ్యవహరిస్తాడు. ఎందుకంటే ధర్మంగా సంపాదిస్తే అన్ని కోరికలను తీర్చుకోవడం సాధ్యం కాదు. ఎంత విచిత్రమంటే ఎవరింటికి వెళ్లినా, ఎక్కడికి వెళ్లినా ఏదో కొత్త వస్తువులు, చీరలు, బట్టలు, ఇతర సామాన్లు కనిపిస్తాయి. వాటిని చూసినప్పుడు మనసుకు "నాకు కూడా ఇది ఉంటే బాగుంటుంది" అని అనిపిస్తుంది. ఇంటికి వచ్చిన తర్వాత దానిని నెరవేర్చుకోవాలని ప్రయత్నిస్తారు. సరే, అది నెరవేర్చుకున్నారనుకుందాం, తర్వాత ఇంకో ఇంటికి వెళ్ళినప్పుడు అక్కడ ఇంకో కొత్త వస్తువు కనిపిస్తుంది, అదీ నెరవేర్చుకున్నాడనుకుందాం.

మళ్లీ ఇంకో చోటికి వెళ్లినప్పుడు ఇంకో వస్తువు కనిపిస్తుంది. ఇలా చూసిన ప్రతిదీ కావాలని మనసు కోరుతూనే ఉంటుంది. కానీ చూసిన ప్రతి దాన్ని నెరవేర్చుకునే శక్తి వుండదు .

వీటన్నిటి వల్ల చివరికి కష్టాల పాలవుతాడు, అలా తన జీవితాన్ని దుఃఖమయం చేసుకుంటాడు, ఎప్పుడూ గొడవలతో సంసారంలో నరకాన్ని

సృష్టించుకుంటాడు, ఆ పరిస్థితి కోరికల వల్లే వచ్చింది.

అందుచేత మీరు తెలుసుకోవాల్సిన ముఖ్య విషయం “కోరికలు తీర్చుకునేవాడు గొప్పవాడు కాదు, కోరికలు అదుపు చేసుకున్నవాడే గొప్పవాడు.” కోరికలు లేకుండా ఎవరూ ఉండలేరు, అవి పుడుతూనే ఉంటాయి. కానీ వాటిని అదుపు చేసుకోవాలి.

అదే నిజమైన గొప్పతనం. వాడికి ఉంది, ఇప్పుడు నాకు లేకపోతే ఏముంది? నా అవసరాలన్నీ తీరుతున్నాయి, నాకు ఎలాంటి లోటు లేదు నాకు ఎలాంటి ఇబ్బంది లేదు అది ఉంటే ఏముంది? లేకపోతే ఏముంది? అన్న స్థితిలో మానవుడు ఉన్నప్పుడు ఎలాంటి గొడవలు ఉండవు.

నిజంగా చూస్తే, కోరికల కారణంగానే చాలా మంది భర్తతో గొడవలు పడుతూ ఉంటారు, “వాళ్లు ఉద్యోగం చేస్తున్నారు, అపార్ట్మెంట్ కొనుకున్నారు, నువ్వు కొనలేదు మనకి ఇల్లు లేదు” అని చెప్పుతూ ఎన్నో గొడవలు పడతారు.

ఇవన్నీ ఎందుకు అంటే కోరికల వల్లే. ఇది ఎందుకు గుర్తుంచుకోవాలంటే, మానవుడిని కష్టాల పాలు చేసేది ఈ కోరికలే. ఎంత కష్టపడి ఒక కోరికను తీర్చుకున్నా, అక్కడితో తృప్తి పడడు. అది పూర్తయ్యాక మళ్ళీ ఇంకో కోరిక కోరుతాడు. సైకిల్ లేని మానవుడు “సైకిల్ ఉంటే బాగుంటుంది” అని అనుకుంటాడు, ఎలా అయినా కష్టపడి సైకిల్ సంపాదించు కుంటాడు. కొన్నాళ్లకు మళ్ళీ “బైక్ ఉంటే బాగుంటుంది” అనే కోరిక వస్తుంది, అలా కష్టపడి బైక్ కూడా సంపాదించుకుంటాడు. అక్కడితో ఊరుకుంటాడా? ఊరుకోడు. తర్వాత “కారు కావాలి” అని కోరుకుంటాడు. మొదట చిన్న కారు కొనుగోలు చేస్తాడు. కొన్నాళ్ళ తర్వాత ఇంకా పెద్ద కారు, తర్వాత ఇంకా సౌకర్యంగా ఉన్న కార్లు కనిపిస్తాయి.

వాటిని చూసి “నాకు కూడా పెద్ద కారు కావాలి” అని కోరుకుంటాడు. కానీ అది తన సామర్థ్యానికి మించినది కాబట్టి అప్పు చేస్తాడు. చివరికి ఆ

అప్పును కూడా తీర్చలేక ఆ కారును తిరిగి అమ్మవలసి వస్తుంది. అమ్మినా కూడా అప్పు పూర్తిగా తీరదు. సంపాదించే దాంట్లో అప్పులు తీర్చడానికే సరిపోతుంది. దాంతో మానవుడు ఎన్నో ఇబ్బందులు పడతాడు. ఇలా గమనిస్తే, ఎవరి జీవితాన్ని చూసినా ఈ కోరికల వల్ల ఎంతో దుఃఖం అనుభవించవలసి వస్తుంది. కానీ కోరికలు లేకుండా ఎవరూ ఉండలేరు.

ఇక్కడ ముఖ్యంగా తెలుసుకోవాల్సింది ఏమిటంటే కోరికలు తీర్చుకోవడం కాదు, కోరికలను అదుపు చేసుకోవడం నేర్చుకోవాలి. అలా అదుపు చేసుకున్న వాడే గొప్పవాడు. "అవి ఎలా అదుపు చేసుకోవాలి?" అని మీరు అడగవచ్చు.

కోరికలు అన్నవి మనసుకు సంబంధించినవి. అందుచేత ఎవరు మనసును అదుపులో ఉంచుకుంటారో, వారి కోరికలు కూడా అదుపులోనే ఉంటాయి, అప్పుడు వారి జీవితమే మారిపోతుంది. ఇప్పుడు మీరు గమనిస్తే ధ్యాన మార్గంలో సాధన చేస్తున్న వారిలో చాలామంది తమ మనసును అదుపులో ఉంచుకుంటున్నారు. మనసు అదుపులో ఉన్నప్పుడు కోరికలు కూడా అదుపులోనే ఉంటాయి. ఎన్ని కోరికలు వచ్చినా, ఎన్ని విషయాలు చూసినా, "ఇది నాకు నిజంగా అవసరమా?" అని ఆలోచించే స్థితి వస్తుంది, అలా ఎంతో మార్పు వస్తుంది. వారే చెబుతున్నారు "ఇదివరకు మా జీవితం వేరుగా ఉండేది, ఇప్పుడు మా జీవితం పూర్తిగా మారిపోయింది" అని. ఇది వరకు ఏది వారి అదుపులో ఉండేది కాదు, ఇప్పుడు అన్నీ వారి అదుపులో ఉన్నాయి. దానికి ముఖ్య కారణం మనసు వారి అదుపులో ఉండడం, దాంతో వారి ఖర్చులు కూడా చాలా తగ్గిపోయాయి.

ఇంకా వారు ఒక ముఖ్యమైన సత్యాన్ని తెలుసుకున్నారు "నేను దేహం కాదు... నేను ఆత్మను" అని. ఈ సత్యాన్ని తెలుసుకున్న తర్వాత, ఆత్మకు ప్రాముఖ్యం ఇవ్వడం ప్రారంభించారు. అందుచేత వారు చేసే ప్రతి

పని ఆత్మకు లాభం కలిగించే విధంగానే ఉంటుంది. అలా చేయడం వల్ల ప్రకృతి నుండి కూడా వారికి ఎంతో లాభం కలుగుతుంది, వారు ఇతరులకు మేలు చేసే పనులు చేస్తారు.

ఎవరి స్థాయిలో వారు కొంతమంది తమ సమయాన్ని ఇస్తారు, కొంతమంది తమ వాక్కును ఇస్తారు, కొంతమంది తమ శక్తిని ఇస్తారు. ఇలా వారు ఏమి ఇస్తున్నారో వారికి తెలియకుండానే అది తిరిగి వారికి లాభంగా వస్తుంది. దాంతో వారి జీవితంలో ఎంతో మార్పు వస్తుంది. ఇలాంటి మార్పులు వచ్చినప్పుడు దుఃఖం ఉండదు, ఆనందమే ఉంటుంది. కోరికలు ఉన్నా వాటికి ప్రాముఖ్యం ఉండదు, ఇంకేమీ కావాలి అనే భావం ఉండదు, ఉన్న దాంతో తృప్తిగా ఉంటారు.

అలా ఉండడం వల్ల జీవితంలో ఎంతో శాంతి, సంతోషం కలుగు తుంది. భార్యాభర్తల మధ్య సంబందాలు కూడా మారిపోతాయి. వారు సరిగ్గా ఉన్నప్పుడు పిల్లలు కూడా వారిని చూసి అలాగే ప్రవర్తిస్తారు. ఇలా ఒకదాని తర్వాత ఒకటి అనుకూలమైన వాతావరణం కుటుంబంలో ఏర్పడుతుంది.

అందుచేత ఎవరైతే ఈ ధ్యానాన్ని తీవ్రంగా చేస్తారో, వారి మనసు వారి అదుపులోకి వస్తుంది. అందుకే పెద్దలు చెబుతారు **"ప్రపంచాన్ని జయించిన వాడి కంటే మనసును జయించిన వాడే గొప్పవాడు అని."**

ఇప్పుడు ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం వల్ల మనసు ఎలా అదుపులోకి వస్తుందో తెలుసుకుందాం. మీరు "శ్వాస మీద ధ్యాస" పెట్టడంవల్ల మనసు మీ అదుపులోకి రావడం ప్రారంభమవుతుంది. ఎలా అంటే మీరు కళ్ళు మూసుకుంటారు, కళ్ళు మూసుకున్న వెంటనే రకరకాల ఆలోచనలు వస్తాయి. గతం గురించి, భవిష్యత్తు గురించి ఆలోచనలు వస్తూ ఉంటాయి. అప్పుడు మీరు ఆ ఆలోచనలను కట్ చేసి మళ్ళీ శ్వాస మీద ధ్యాస పెడతారు, మళ్ళీ ఆలోచనలు వస్తాయి, మళ్ళీ వాటిని కట్ చేస్తారు. ఇలా మళ్ళీ మళ్ళీ

చేస్తూ ఉంటే, ఆ ఆలోచనలు క్రమంగా తగ్గిపోతాయి.

ఒక దశలో ఆలోచనలు పూర్తిగా ఆగిపోతాయి. ఎప్పుడైతే ఆలోచనలు లేకుండా ఉంటారో, ఆ స్థితిలో మానవుడు గతంలోకి వెళ్ళడు, భవిష్యత్తులోకి వెళ్లడు. మనసు నిశ్చలంగా మారిపోతుంది. అంటే మనసు అతని అదుపులోకి వచ్చినట్లే. ముందు "శ్వాస మీద ధ్యాస" పెట్టినా మనసు పారిపోతుంది. మళ్ళీ తీసుకొస్తారు మళ్ళీ పారిపోతుంది, అంటే మనసు అదుపులో ఉండదు. ఆ అదుపులో లేని మనసును అదుపులో ఉంచుకోవడమే ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం. చాలామంది ధ్యానాన్ని చిన్న విషయం అనుకుంటారు. కానీ గుర్తుంచుకోండి మొదటి లాభం ఏమిటంటే "మనసు అదుపులోకి రావడం" ఇంతకంటే పెద్ద లాభం ఇంకేముంది?

ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం తప్ప ఇంకా ఎలాంటి ధ్యానం చేసినా మనసు పూర్తిగా ఆగదు. ఇతర ధ్యానాల్లో మనసు పని చేస్తూనే ఉంటుంది. కానీ ఎప్పుడైతే మనసు పని చేయని స్థితికి వస్తుందో, అప్పుడు మాత్రమే అది మీ అదుపులోకి వచ్చినట్లు. మీరు ఇలా రోజులు, నెలలు పాటు గంటల తరబడి సాధన చేస్తే, మనసు పూర్తిగా అదుపులోకి వస్తుంది. అప్పుడు మానవుడు ఏదైనా అదుపు చేసుకోగలుగుతాడు.

ఒక వ్యాపారస్తుడిని గమనించండి మొదట లక్ష సంపాదిస్తాడు. తర్వాత పది లక్షలు కావాలి అంటాడు, అది సంపాదించిన తర్వాత ఇంకా ఇరవై ఐదు లక్షలు అంటాడు,అది వచ్చిన తర్వాత యాభై లక్షలు అంటాడు. తర్వాత "ఇంత వస్తోంది కదా" అని ఇంకా అప్పు చేసి వ్యాపారాన్ని పెంచుతాడు, చివరికి అన్నీ కోల్పోతాడు, ఏడుస్తూ కూర్చుంటాడు. దీనికి అంతం ఎక్కడ?

అందుచేత ఎవరైతే ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం తీవ్రంగా చేస్తారో, వారు మనసును అదుపులో ఉంచుకుంటారు, అప్పుడు కోరికలను కూడా అదుపులో ఉంచుకోగలగుతారు. కోరికలు అదుపులో ఉన్నవాడి జీవితం పూర్తిగా మారిపోతుంది, అంతకంటే ఇంక కావాల్సింది ఏమీ లేదు.

# “ఇతరులు ఏదో అనుకుంటారని ఏదీ చేయకూడదు”

**“ఇతరులు ఏదో అనుకుంటారని ఏది చేయకూడదు”.** ఎందుచేత నంటే ఎన్నో పనులు చేస్తూ ఉంటాం, ఏ పని చేస్తున్నా ఆ పని చేసేటప్పుడు మీ స్తోమత చూసుకోవాలి. దాన్ని బట్టి మీరు ఆ పని చేసినప్పుడు మీకు ఏ ఇబ్బందులు రావు.

వాళ్ళు ఏదో అనుకుంటారని, వీళ్ళు ఏదో అనుకుంటారని మీ ఆర్థిక స్థితి మించి మీరు ఖర్చు చేసినట్లయితే కష్టాల పాలయ్యేది మీరే. ఏ చిన్న పని చేసినా కూడా ఇతరులు ఏమనుకుంటారో అని చేస్తూ ఉంటారు. చిన్న ఫంక్షన్ పెట్టి భోజనాలు పెట్టినా ఒక స్వీట్ అయినా వేయకపోతే ఏమనుకుంటారో అని అనుకుంటారు.

ఒక స్వీట్ చేశారు, వాళ్ళు రెండు వేశారు మనం ఒకటి వేస్తే ఏమనుకుంటారు అని చేసేవాళ్ళు ఉన్నారు. చందాలు ఇచ్చేటప్పుడు కూడా ఇవ్వకపోతే బాగోదేమో వాళ్ళు ఏమనుకుంటారో అనే మొహమాటంతో ఇచ్చి తర్వాత బాధపడతారు. సేవ చేయ్యొచ్చు మంచిదే! చేయాలి కూడా! మీకు వున్నంతలో చేయండి పర్వాలేదు.

ఇతరులకు ఇవ్వడం వల్ల అది సద్వినియోగం అవుతుందా? లేదా? అన్నది మనకు తెలియదు. అది సద్వినియోగం అవ్వకపోతే, అపాత్రదానం అవుతుంది. చాలా కొద్దిమందే వచ్చిన దాన్ని సద్వినియోగం చేస్తారు. లోకంలో ఎక్కువమంది ఈ రోజుల్లో స్వార్థంతో చేసేవారే కనిపిస్తున్నారు.

వాడేమనుకుంటాడో, వీడేమనుకుంటాడో అని చేస్తే చేసిన దాని ఫలితం దక్కకపోగా అపాత్రదానం చేసినట్టు అవుతుంది. అందుచేత ఇది ఎప్పుడు మర్చిపోకూడదు, ఇతరులు ఏదో అనుకుంటారని ఏదీ చేయకూడదు.

నేను ఇంతకుముందు అలాగే చేసేవాడిని. కాని ఇప్పుడు అలా

ఖర్చు పెట్టే బదులు ఇతరులకు లాభించే లోకకళ్యాణకరమైన పనులకు ఖర్చు పెడితే ఆ ఫలితమైనా నాకు వస్తుంది. అంతే కానీ ఇతరులు ఏదో అనుకుంటారని చేసింది ఫలితం రాకపోగా విలువైన నా ధనాన్ని వృధా చేసుకున్న వాడిని అవుతాను అని తెలుసుకోవాలి.

మీరు చూడండి జనరల్ గా వివాహా వేడుకలు ఎంత ఆర్భాటంగా చేస్తున్నారో! ఒకళ్ళకు మించి ఒకళ్ళు ఎంత డెకరేషన్, ఎంత ఖర్చు. మా పిల్లలు పెట్టే ఖర్చు చూస్తూ ఉంటాను. నాకు బయట ఎవరో అక్కర్లేదు మా ఇల్లే సరిపోతుంది పాఠాలు నేర్చుకోవడానికి, మన వాళ్ళే సరిపోతారు.

ఎంత డెకరేషన్ చేస్తున్నారు అంటే పెళ్లికి, మళ్ళీ రిసెప్షన్ అంటూ ఖర్చు పెడతారు. విచిత్రం ఏమిటంటే అన్ని లక్షలు ఖర్చు పెట్టి చేసింది తెల్లవారితే ఏమీ ఉండదు. మా పిల్లల్ని అడిగాను ఎందుకు ఇదంత దండుగ కదా? అని అంటే! వాళ్ళు చెప్పిన సమాధానం... మా అబ్బాయి గాని, మా అమ్మాయి గాని వాళ్ళని నేను అశ్రద్ధ చేశానని వారు అనుకోకూడదు అని అంటారు.

కంపారిజన్ తో, వాళ్ళు ఏదో అనుకుంటారని భోజనాలు పెట్టారు ఆకు 1500, 2000 అట. నేను అక్కడ గమనించాను వీళ్ళు తినేవన్నీ ఒక ప్లేట్ లో పెట్టుకొని తిన్నారనుకోండి. అప్పుడు దాని కాస్ట్ ఎంత ఉంటుందో వీళ్ళకి తెలుస్తుంది.

నా లెఖ్ఖ ప్రకారం అన్ని ఐటమ్స్ కలిపి రూ. 200/– మించి ఉండదు, కాని దానికి రూ. 2000/– కర్చు పెడతారు. వాడు ఊరికే డెకరేషన్ గా స్టాల్స్ పెడతాడు, అన్ని తింటే చచ్చి ఊరుకుంటారు. మళ్ళీ వారం రోజుల దాకా లెగరు, మరి ఇదేం పిచ్చో! మా చిన్నప్పుడు చేసే పెళ్ళిళ్లు రెండు స్వీట్లు వేస్తే ఎక్కువ. ఇప్పుడు రెండు స్వీట్లు వేసి పెట్టండి ఎలా లెక్కేస్తారో!

ఒకసారి మీరు వెళ్ళి చూస్తే తినేసిన తర్వాత ఇవన్నీ అక్కడ తొట్లో

పడేస్తారు. అక్కడ చూస్తే మీకు తెలుస్తుంది ఎంత వెస్ట్ అయిందో! నేను ఇవే అబ్సర్వ్ చేస్తాను. వాడు అలా చేశాడు, వీడు ఇలా చేశాడు, ఎందుకండి ఇవన్నీ.

ఆ మగపెళ్ళివారు ఏమనుకుంటారో! ఆడపెళ్ళివారు ఏమనుకుంటారో! అని ఆ శుభలేఖల నుంచి మొదలెడతారు. చూసుకోండి కావాలంటే! ముకేష్ అంబాని శుభలేఖ, నాలుగు లక్షలట. ఏం చేస్తాడు? ఉన్న డబ్బులు ఏం చేయాలో తెలియక అలా ఖర్చు పెడతారు.

నాకు పిల్లలు ముగ్గురు, ఇద్దరు అబ్బాయిలు ఒక అమ్మాయి. శుభలేఖకు ముగ్గురి పెళ్ళిళ్ళకు ఐదు రూపాయలు మించి వెయ్యలేదు. ఎవరు ఏమనుకన్నా నేను పట్టించుకోలేదు. అప్పుడు అనుకున్నారు, కాని ఇప్పుడు ఎవరికి గుర్తుంది. మా పెద్దబ్బాయికి పెళ్ళి భీమవరంలోనే జరిగింది. వాళ్ళు దగ్గర ఊరు కాబట్టి అక్కడ అంత ఫెసిలిటీస్ లేవని భీమవరంలోనే చేశారు. పెళ్ళి భీమవరంలోనే అయిందని రిసెప్షన్ మానేశాము.

లేకపోతే దానికి కొన్ని లక్షలు ఖర్చు పెట్టాలి, ఇప్పుడు అయితే 2, 3 కోట్లు ఖర్చు, ఇంకా ఎక్కువ ఖర్చుపెట్టేవాళ్ళు ఉన్నారు. మా పిల్లలు బాధపడ్డారు, కాని ఇప్పుడు ఇంకెక్కడ గుర్తుంటాయి. నిజంగా ఆలోచించండి. అప్పుడు అంత ఖర్చు పెట్టే బదులు అప్పుడే బంగారం కొని వీళ్ళకి ఇస్తే అప్పుడు 150 రూపాయలు కాసు, ఇప్పుడు ఎంత అవుతుంది.

లేకపోతే పది మందికి ఉపయోగపడే పనికి ఖర్చు పెడితే ఆ పుణ్యమైనా దక్కుతుంది. నా డ్రెస్సులు ఈ మధ్యే మారాయి, ఇంతకు ముందు ఇలా ఉండేవి కావు. ఎవడేమనుకుంటే నాకేంటి అనుకునే వాడిని. ఇందులోకి వచ్చినప్పుడు కూడా! అలా ఖర్చు పెట్టే బదులు నాకు అనిపించేది! ఒక డ్రెస్సు కొని 5000, పదివేలు ఖర్చు పెట్టే బదులు ఆ డబ్బుతో ఫ్రీగా అందరికీ

పుస్తకాలు పంచి పెడితే, లేకపోతే డిస్కౌంట్లో ఇస్తే వాళ్ళకి ఎంత లాభం.

నాకు బాగా తెలుసు 22 ఏళ్ల క్రితం భీమవరం 3 రోజుల కార్యక్రమం స్టార్ట్ చేసినప్పుడు భోజనానికి పూటకి ఐదు రూపాయలు ఖర్చు అయ్యేది.

ఇప్పుడు రేట్లు బాగా పెరిగాయి. భీమవరంలో మీకైనా స్వీట్లు, హాట్లు వేసి పెడుతున్నామా? కడుపు నింపుతున్నాం అంతే కదా? ఏదో మీరంతా జ్ఞానులు కాబట్టి మీరు ఏమి పట్టించుకోవట్లేదు, మీకు కడుపులో పడేదాని కంటే మనసులో పడే జ్ఞానం మీద ఎక్కువ దృష్టి ఉంది.

ఏది ఏమైనా ఇతరులు ఏదో అనుకుంటారని, ఏది చేయకండి, మీ అర్హతను బట్టి, మీ స్తోమతను బట్టి మీరు ఎంత చేయాలనుకుంటే అంతే చేయండి. ఎవరికి వారు ఎవరి స్థాయికి తగ్గట్టు వాళ్ళు ఎంతో కొంత ఆదా చేసుకోండి. ఉన్న ధనాన్ని లోక కళ్యాణం కోసం ఖర్చు పెట్టండి.

ముఖ్యంగా సృష్టి నియమం ఏమిటంటే? "పంచింది పెంచ బడుతుంది". అందుచేత "వృధాగా ఖర్చు చేసేదాన్ని పంచండి" అంటే లోక కళ్యాణ కరమైన పనులకి ఉపయోగించండి.

మా దంపతులు ఇద్దరికీ వేరే సరదాలు, ఎంజాయ్ మెంట్లు ఏమీ లేవు. మీరందరూ సంతోషంగా ఉంటే అదే మా సంతోషం, మీరందరూ ఆనందంగా ఉంటే అదే మా ఆనందం. అందుచేత ఇతరులు ఏదో అనుకుంటారని ఖర్చు పెట్టకుండా కొంత మీ లాభం కోసం అంటే లోక కళ్యాణం కోసం కేటాయించుకోండి, మీ దగ్గర ఉన్నవన్నీ ఊడ్చి పెట్టి ఇవ్వక్కర్లేదు. వృధా చేసేదాన్ని ఇవ్వండి చాలు, అదే ఎక్కువ. మరుజన్మ గొప్ప జన్మ వస్తుంది. ఆ జన్మలో ఇతరుల కోసం జీవిస్తారు, ఆ స్థాయికి మీరు రాగలిగారు అంటే చివరి జన్మలకు వచ్చినట్టే! ఈ జన్మ లో మీరు చేసిన దాన్ని బట్టి! జీవించిన విధానాన్ని బట్టి! మరుజన్మ ఆధారపడి ఉంటుంది, ఎప్పుడూ మీరు ఇది

గుర్తుపెట్టుకోండి.

ఈ జన్మలో పంచితేనే మరు జన్మ గొప్పగా ఉంటుంది. మీకు ఇవ్వబడిన, మీరు పొందిన వాటిలో అవసరాలకు ఉపయోగించుకొని ఇతరులు ఏమనుకుంటారో అన్నది లెక్క చేయకుండా ఆదా చేసి ఇతరుల లాభం కోసం మీరు ఖర్చు పెట్టినప్పుడు ఖచ్చితంగా మరుజన్మ గొప్పగా ఉంటుంది.

ఇతరులు ఏమనుకుంటారో అని గొప్పల కోసం ఖర్చు పెడితే శుభ్రంగా తినేసి వెళ్లేటప్పుడు ఏమంటారంటే! చాలా బాగా చేశావురా అని, బయటికి వెళ్ళి ఏమనుకుంటారంటే వీడు బాగా బలిశాడురా అందుకే ఇలా ఖర్చుపెట్టాడు అంటారు.

కానీ ఈ రోజుల్లో ఇంతలా ఆలోచించే వాళ్ళు చాలా తక్కువ ఉంటారు. ఎవరికైతే బుద్ధి పెరుగుతుందో! అలాంటి వారు మాత్రమే ఈ రకంగా ఆలోచించగలుగుతారు.

పరిపక్వమైన బుద్ధి ఉంటే ఆధ్యాత్మికంగా ఆలోచిస్తారు, ఆత్మకు ప్రాముఖ్యం ఇస్తారు. పరిపక్వత లేని బుద్ధి ఉన్నవారు ప్రాపంచిక భోగాల కోసం చూస్తారు. దేహం గురించి ఆలోచిస్తారు. అందుకే పత్రి గారు **“బుద్ధి శాతం పెరిగే కొద్ది ఆధ్యాత్మిక ఆసక్తి ఎక్కువ ఉంటుంది, బుద్ధి శాతం తక్కువ ఉంటే ప్రాపంచిక ఆసక్తి వుంటుంది”** అంటారు.

చేసే ధ్యానాన్ని బట్టి బుద్ధి శాతం పెరుగుతూ ఉంటుంది, మీ బుద్ధి పెరిగే కొద్ది ఆ బుద్ధే మీకు గురువై మిమ్మల్ని నడిపిస్తుంది.

మీరు బుద్ధి పెంచుకునే కొద్ది ఇతరులు ఏమనుకుంటారో అని ఏదీ చేయరు, బుద్ధిని బట్టే మీరు నడుచుకుంటారు. మీ బుద్ధి తప్పుడు నిర్ణయం చేయదు, మీకు నష్టం కలిగించదు, మిమ్మల్ని సరైన విధంగా నడిపిస్తుంది.

# “భూలోకవాసులు చేసేవన్నీ పైలోకవాసులు చూస్తుంటారు”

మనం మరణానంతర జీవితం గురించి తెలుసుకుంటున్నాం. ఎవరికైతే “మరణానంతర జీవితం మీద అవగాహన ఉంటుందో వారు వారి లక్ష్యానికి అంత దగ్గర అవుతారు”. ఇప్పుడు ఇంకొక విషయం తెలుసుకుందాం.

మరణించిన తర్వాత మీరు ఏం తెలుసుకుంటారో, జీవించి వుండగా అది తెలుసుకోము. కానీ, ఎవరైతే మరణించిన తర్వాత జరిగేది జీవించి ఉండగానే తెలుసుకుంటే వాడిని “జ్ఞాని” అనడమే కాదు, వారు వారి లక్ష్యానికి దగ్గర అవుతూ ఉంటారు. అంటే వారికి జన్మలు తగ్గిపోతూ ఉంటాయి. అంటే చివరి జన్మలోకి వస్తున్నారు అని లెక్క వారు చాలా అదృష్టవంతులు.

అందుచేత అందరికీ నేను చెప్పేది ఏమిటి అంటే మరణించిన తర్వాత జరిగే వాటిని తెలుసుకునే ప్రయత్నం చెయ్యండి. ఇప్పటి వరకు నేను ఎన్నో విషయాలు చెప్పాను, ఇంక ఏమైనా కొత్త విషయాలు మీరు తెలుసుకోగలిగితే నా దృష్టికి తీసుకురావచ్చు.

ఇప్పుడు మనం **“భూలోకవాసులు చేసేవన్నీ పైలోకవాసులు చూస్తూ ఉంటారు”** అనే విషయం తెలుసుకుందాం. ఈ విషయం కూడా మరణించిన తర్వాతే తెలుస్తుంది

మిమ్మల్ని, మీరు చేసే పనుల్ని, మీరు మాట్లాడే మాటల్ని, మీ చేష్టల్ని పైలోకవాసులు చూస్తూ ఉంటారు. ఈ విషయం భూమ్మీద మీకు తెలియదు కానీ, శరీరం వదిలి పైలోకాలకి వెళ్ళినప్పుడు అక్కడ తెలుసుకుంటారు.

కానీ మీరు ఈ విషయం భూమి మీదే తెలుసుకుంటే మీలో ఎన్నో మార్పులు వస్తాయి, మీ జీవితాన్ని ఎంతో మార్చుకుంటారు. ఎందుచేతనంటే భూమ్మీద జీవిస్తున్నవారు మమ్మల్ని ఎవ్వరూ చూడట్లేదు, గమనించట్లేదు అనే భావంతోటే జీవిస్తూ ఉంటారు.

కానీ మరణించిన తర్వాత మీకు ఇంకా చాలా తెలుస్తాయి. ఎందుకంటే ఆ పైలోకాల్లో భూమ్మీద చెప్పుకునేటువంటి 700, 800 కోట్లు మానవులు మాత్రమే కాదు కోటాను కోట్లు అంటే లక్షల కోట్లు, కోటాను కోట్లు వున్నారు, వారంతా రకరకాల లోకాల్లో ఉంటారు.

అందులో చాలా గొప్పవారు గొప్ప లోకాల్లో ఉంటారు, అంటే జనాలోకం దాటి ఉన్న లోకాల్లో ఉంటారు. అలాగే ఎన్నో రకాలైనటువంటి స్థాయిలో ఉన్నవాళ్ళు కూడా ఉంటారు. మనం చెప్పుకుంటూ ఉంటాం దేవతలు, దేవుళ్ళు, కిన్నెరలు, కింపురుషులు ఇలాగ రకరకాల వాళ్ళు ఆయా లోకాల్లో ఉంటారు అని. ఎన్ని కోట్ల సంవత్సరాలు అయిందో సృష్టి ప్రారంభించబడి, ఎంతమంది ఆ స్థాయికి ఎదిగారో? మరి ఏం చేస్తారు వాళ్ళంతా? వాళ్ళు చేసే పనుల్లో ఒక పని ఏమిటి అంటే, "ఈ భూలోకవాసుల మీద కూడా వాళ్ళు దృష్టి పెడతారు, వీళ్ళని గమనిస్తూ ఉంటారు". వీరిలో అర్హత ఉన్న వాళ్ళకి అంటే ఎవరైతే లోక కళ్యాణం కోసం పాటుపడుతూ ఉంటారో వారికి అన్ని రకాలుగా సహకారం అందించడానికి చూస్తూ ఉంటారు.

అలాగే ఈ భూలోకంలో లాగే ఆ పై లోకాల్లో కూడా ఎన్నో రీసెర్చ్ లు జరుగుతూ ఉంటాయి. పత్రి గారు ఓ సందర్భంగా క్రింద ఎలా జరుగుతూ ఉంటుందో పైన కూడా అలాగే జరుగుతుంది అని చెప్పారు.

"క్రింద తెలియని వాళ్ళకి తెలిసున్న వాళ్ళు ఎలా చెప్తూ ఉంటారో! బోధిస్తూ ఉంటారో"; "పైన కూడా తెలియని వాళ్ళకి తెలిసున్న వాళ్ళు బోధిస్తూ ఉంటారు". క్రింద ఎన్ని రీసెర్చ్ లు జరుగుతున్నాయో పైన కూడా జరుగుతూ ఉంటాయి. అలా రీసెర్చ్‌లు చేసి వారు కనుక్కున్నవి ప్రాక్టికల్‌గా పరీక్షించు కోవడానికి భూమిమీద అర్హత ఉన్న వాళ్ళకి అందిస్తూ ఉంటారు, అందించడం అంటే స్ఫురింప చేస్తారు.

అప్పుడు వాళ్ళు తనకి స్ఫురించిన దాన్ని లోకంలో అందరికీ అందిస్తూ

ఉంటారు. అలా ఇప్పుడు భూమి మీద ఎంత డెవలప్మెంట్ అయిందో మనం చూస్తున్నాం. టెక్నాలజీ పరంగా ఎంత అభివృద్ధి చెందిందో మనం చూస్తున్నాం. ఇక్కడ ఎవరు కనిపెడుతున్నారు?ఎలా కనిపెడతారు? భూమ్మీద ఉన్న వాళ్ళకి ఆ పై లోకవాసులు ఇవ్వడం వల్లే. వాళ్ళు ఎన్నో రకాలుగా సాయం చేయడానికి చూస్తూ ఉంటారు.

ఎందుచేతనంటే పై లోకంలో ఉన్న వాళ్ళకి తెలుసు ఈ భూలోకంలో ఉన్నవాళ్ళు శరీరమే నేను అనుకున్నట్టుగా జీవిస్తూ ఉంటారు, నేను ఆత్మ అన్నది మర్చిపోతారు. అందుచేత అందులో ఆసక్తి, అర్హత ఉన్న వాళ్ళని చూసి వాళ్ళకి ఈ జ్ఞానం అందించే ప్రయత్నం కూడా వారు చేస్తూ ఉంటారు. అనుకోకుండా ఆ అర్హత ఉన్న వాళ్ళకి సద్గురు సాంగత్యం దొరుకుతుంది, పరిస్థితులను అలా కల్పిస్తారు వారు.

ఇప్పుడు చూడండి నా విషయం తీసుకుంటే నేను నా కూల్ డ్రింక్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ లో కూర్చుని వుంటే శ్రీదేవి అనే ఆవిడ వచ్చింది. ఆవిడకి పత్రి గారు నువ్వు భీమవరంలో క్లాస్ ఒకటి ఏర్పాటు చెయ్యాలి అన్నారట. ఆవిడ భీమవరంలో  మన ధ్యాన మందిరంలో క్లాస్ ఏర్పాటు చేస్తానేమో అని వచ్చి నన్ను అడిగింది.

ఆవిడ పత్రి గారు అని  పెద్ద గురువుగారు ధ్యానం చెబుతారు ఏదైనా ఓ ధ్యాన క్లాస్ ఏర్పాటు చేయండి అని అడిగింది. అప్పుడు నేను ఆవిడ తోటి అన్నాను ఆయన ఏమైనా డబ్బులు తీసుకుంటారా? అని అడిగితే ఆవిడ, ఆయన ఏమి తీసుకోరు, ఉచితంగానే చెప్తారు అంది.

అప్పుడు ఏర్పాటు చేస్తా అన్నాను. మరి ఆయన ఎవరో  నాకు తెలియదు కాస్త పరిచయం చేయమ్మా అన్నాను. సరే అని తిరుపతిలో ఉన్న ఆయనతో మాట్లాడించింది. ఎందుకో తెలియదు కానీ ఆయన మాటల్లోనే ఏదో చాలా అనుబంధం ఏర్పడింది, ఆ అట్రాక్షన్ ఏంటో కూడా అప్పుడు

తెలియలేదు.

ఆ మాటల్లో పత్రిగారు ఏమన్నారంటే మహాభారతం జరగాలి అంటే కృష్ణుడి ఒక్కడి వల్ల ఎలా అవుతుంది? అర్జునుడు కూడా ఉండాలయ్యా అన్నారు, ఇద్దరూ ఉంటేనే కదా యుద్ధం అయ్యేది అన్నారు. తర్వాత అర్థమైంది ఆయన నన్ను ఏ ఉద్దేశ్యంతో అలా అన్నారు అని. సరే ఏదైతే మొత్తం మీద క్లాస్ ఏర్పాటు చేయడం జరిగింది, భారీ ఎత్తున ఏర్పాటు చేశాను. నేను ఏది పట్టుకున్నా గట్టిగానే పట్టుకుంటాను, భీమవరంలో బ్యాంకులని, ఆఫీసులని, గవర్నమెంట్ ఆఫీసులని స్కూల్స్ అని ఇలాగ అన్నిటికీ మా ఫ్రెండ్స్ ఇద్దరిని వేసుకుని తిరగడం జరిగింది, పాంప్లెట్లు వేసి అవి కూడా పంచి పెట్టడం జరిగింది.

మా రైస్ మిల్ ప్రాంగణంలోనే పెద్ద ప్లేస్ ఉంది కాబట్టి సుమారు 1000 మందితో అక్కడ ఏర్పాటు చేశాం, బాగా సక్సెస్ అయింది ఆ క్లాస్‌లో పత్రిగారు బాగా క్లోజ్ అవ్వడం జరిగింది. ఇక్కడ చెప్పేది ఏమిటంటే ఇదంతా కాకతాళీయంగా జరగలేదు "పైలోకవాసులు చేసినటువంటి ఏర్పాటే ఇది" అని అనుకోవాలి.

భూమి మీద అన్నీ జరుగుతూ ఉంటాయి. అన్నిటితో పాటు ఆధ్యాత్మిక అభివృద్ధి కూడా జరుగుతూ ఉంటుంది, దానికి ఎలాంటి వారిని ఎలా కలపాలో దగ్గర చేయాలో చూస్తారు వాళ్ళు. దానికి అనుగుణంగానే వారు చేయవలసింది చేస్తారు. మీరు చూడండి నేను ఆర్మూరు చాలా సార్లు వెళ్ళాను. నాకు భువనేశ్వరి, పద్మ పరిచయం కాకముందే 2006 లో 10,15 ఏళ్ల క్రితమే వెళ్ళడం జరిగింది ఎంతో మందిని కలిశాను కానీ సరిపోలేదు.

అందుచేత మరి వీళ్ళు కూడా అనుకోకుండా కలిశారు. అవసరం ఉంది కాబట్టే ఈ ఆధ్యాత్మిక జ్ఞానం వ్యాపించాలి అంటే ఆ పరిచయాలు ఉన్నప్పుడే జరుగుతుంది. ఇదంతా ఊరికే కాకతాళీయంగా జరిగింది కాదు.

అలా జరిగినప్పుడు చాలా దగ్గర అవుతారు, ఆశ్చర్యం వేస్తుంది మనకి. ఇదంతా పై లోకంలోని ఆ పై లోకవాసులు చేస్తున్న ఏర్పాటే.

మీరు కూడా ఊరికే ఇందులోకి రాలేదు, ఎప్పుడు ఏం జరగాలో అది జరుగుతూ ఉంటుంది. మనం ఏదో చేస్తున్నామని అనుకుంటాం, కానీ ఎన్నో సార్లు చెప్పుకున్నాం "మన చేత చేయించబడుతుంది తప్ప మనం ఏమి చేయట్లేదు అని".

నేను కూడా కొన్ని సందర్భాల్లో చెప్పడం జరిగింది. ఏమిటంటే, ఒక్కోసారి నేను మాట్లాడుతూ ఉంటే నాకే డౌట్ వచ్చేది, నేనేనా మాట్లాడేది అని, ఆ విషయాలు అంతకుముందు తెలియవు సడన్ గా ఇప్పుడు ఎలా స్ఫురణకు వచ్చాయి అని అనిపించేది.

పత్రి గారు అన్నారు ఎంతో మంది దేవతలు, దేవుళ్ళు ఎవరికీ సాయం చేయాలా అని చూస్తూ ఉంటారు. నువ్వు చేసే పని గొప్ప పని అయినప్పుడు అది లోక కళ్యాణానికి ఉపయోగపడేటప్పుడు ఇతరులకు సందేశాలు ఇస్తామో మన వాయిస్ వాళ్ళు హ్యాండ్ ఓవర్ చేసుకుని, ఇస్తూ వుంటారు. వారు అపారమైన జ్ఞాన సంపన్నులు వాళ్ళు ఋషులు అవ్వచ్చు, మహర్షులు అవ్వచ్చు, గొప్ప జ్ఞానులు అవ్వచ్చు, యోగీశ్వరులు అవ్వచ్చు, కోటాను కోట్లు ఉన్నారు. వాళ్ళలో ఎవరో ఒకళ్ళు మన వాయిస్ హ్యాండ్ ఓవర్ చేసుకొని వాళ్ళు చెప్పేసి వెళ్ళిపోతారు, పేరు మనకు వస్తుంది. ఇవన్నీ ఆ పై లోకవాసులు చేయించేవే కానీ ఇంకోటి కాదు.

మీరు సాధారణంగా ఈ ఆధ్యాత్మికతలో భయపడతారు ఏదైనా ఒక కార్యక్రమం చేయాలంటే. స్పిరిచ్యువాలిటీలో ఓ పని చేయాలంటే నేను చేయగలనా? లేదా? అని సందేహిస్తారు. కాని మీరు నిస్వార్థంగా ఏదైనా ఒక కార్యక్రమం తలపెట్టండి, మీరు ధైర్యంగా ముందుకు వచ్చినప్పుడు, ఇటువంటి కార్యక్రమం తలపెట్టినప్పుడు ఎవరో ఒకరి ద్వారా సాయం అందుతుంది.

నాకు ఈ చందా ఇవ్వాలని ఉందండి, లేకపోతే ఈ ఫండ్ ఇవ్వాలని ఉంది అని చెప్పి ముందుకు వస్తారు. మనకే ఆశ్చర్యం వేస్తుంది, అసలు ఊహించం మనం.  ఎవరో వచ్చి ఫండ్ ఇస్తారు. మరి మన సొసైటీ వారు నిర్వహించే యజ్ఞాలన్నీ చూడండి ఎక్కడ లాస్ వచ్చాయి ఎన్ని కోట్లు అయినా సరే ఆటోమేటిక్ గా అయిపోతున్నాయి. ఎప్పుడు ఇవ్వని వాళ్ళకి ఇవ్వాలని అనిపిస్తుంది. ఆ పైలోకవాసులే వాళ్ళకి స్ఫురింప చేస్తారు. వాళ్ళు ఇంత మంచి చేస్తున్నారు మనం ఎంతో కొంత చేయాలి అని అనిపిస్తుంది. ఆ పై లోక వాసులకు అనిపించబట్టే మీరు చేశారు కానీ లేకపోతే ఎందుకు చేస్తారు?

మొన్న మైసూరులో ఒక కార్యక్రమం చేశాం, ఊహించినంత జనం వచ్చారు అక్కడ. దానికి ముఖ్య కారణం పై లోకవాసుల సహకారమే!

నేను అరుణ్ కుమార్‌ని అడిగాను ఇంత ధైర్యంగా ఎదరికి వెళ్తున్నావు నీకు ఈ ఫండ్ ఎలా వస్తుందయ్యా అని చెప్పి?  ఒకటే చెప్పాడు చేతులు పైకెత్తి ప్రకృతి చూసుకుంటుందండి అన్నాడు. అతని యొక్క ధైర్యం ఇక్కడ నేనేదో చిన్న క్లాస్ పెడతాడని చూడవయ్యా అన్నా ఓ 50 మందికో, 100 మందికో! ఎంత ధైర్యం ఉంటే అంత పెద్ద హాల్ తీసుకుంటాడు. ధైర్యంగా ఎదరికెళ్ళాడు, ఇటువంటి వాళ్ళకి ప్రకృతి ఎప్పుడూ సహకరిస్తూ ఉంటుంది. ప్రకృతి అంటే ప్రకృతిలో ఉన్నవాళ్ళు. విచిత్రం ఏమిటంటే ఇక్కడ ఇటువంటి పనులు చేసేటప్పుడు ఆ కార్యక్రమానికి లోటు లేకుండా వస్తుంది, అంతే కానీ అధికంగా లక్షలు లక్షలు రావు. ఇది కూడా ఒక్కసారి మీరు గమనించుకోండి. కొంతమంది స్వార్థంతో డబ్బులు పోగేసుకుందాం అనుకుంటారు. అటువంటి వాళ్ళకి వాళ్ళ సహకారం ఉండదు, నానా తిప్పలు పడతారు కానీ సక్సెస్ అవ్వలేరు.

అందుచేత గుర్తుంచుకోండి మీరు ఎప్పుడూ మీ స్వార్థం కోసం చూసుకోకుండా నిస్వార్థంగా లోక కళ్యాణం కోసం మీరు కృషి చేస్తూ ఉంటే

మీకు తగ్గట్టు, మీ స్థాయిలో తప్పకుండా పైలోకవాసుల యొక్క సహకారం మీకు తప్పనిసరిగా అందుతుంది. ఇది మటుకు మర్చిపోకండి, మీలో స్వార్థం ఉంటే మటుకు మళ్ళీ మీరే దెబ్బ తింటారు.

మీకు ఇక్కడ తెలీదు ఎక్కడున్నారండి? ఎవరు చూస్తారండి? ఎవరు ఇస్తారండి? ఇలాంటి ఏదో సందేహాలు వస్తాయి. మీరు చనిపోయిన తర్వాత తెలుస్తాయి ఇవన్నీ. పై లోకాల్లో ఎంతో మంది ఉన్నారు, ఎన్నో లోకాలు ఉన్నాయి ప్రతి లోకంలోనూ లక్షల మీద కోట్ల మీదో ఉన్నారు అని.

మీకు భూమిమీద ఏం కనిపిస్తుందండి? అసలు భూమిమీద ఎంత ఉంది? సృష్టిలో ఉన్న కోటాను కోట్ల లోకాల్లో భూమి ఎంత? పత్రిగారు ఒకసారి కార్లో వెళ్తూ వుంటే ఇలాంటి భూలోకాలు లక్షలు ఉన్నాయి అన్నారు. నేను అప్పుడు అడిగాను మరి ఇన్ని ఉన్నాయి అని అంటున్నారు వీటిలో ఏది గొప్పదండి అన్నాను. అప్పుడు ఆయన దేని గొప్పతనం దానిదే అన్నారు.

అందుచేత మన కళ్ళకు కనిపించేది ఎంత? ఎంతసేపు ఈ భూమి, మీ కుటుంబీకులు, భార్య, భర్త , పిల్లలు ఇవే తప్ప ఇంకేం తెలుసు. అరే ఎంత ఉంది? ఈ సృష్టి ఎన్ని లోకాలు ఉన్నాయి? ఎంతమంది ఉన్నారు? ఎన్ని తెలుసుకోవాలి.

మీరు చనిపోయిన తర్వాతే ఇవన్ని మీకు అర్థం అవుతాయి, ఇక్కడేం తెలుస్తాయి? మీకేమో మీ ఇల్లే మీకు ప్రపంచం, ఇంకా కొంతమంది ఆడవాళ్ళకి వంటిల్లే ప్రపంచం. అంతకన్నా వాళ్ళకి ఇంకేం తెలియదు. జన్మ జన్మ అంతా ఆ వంటిల్లే! అంతకు తప్ప ఏమీ తెలుసుకోరు. వంటిల్లు గురించి తెలుసుకోవడానికి భూమి మీదకి వచ్చారా? ఆలోచించండి?

ఎవరు మీరు? ఆత్మలైన మీరు ఎన్నో తెలుసుకోవాలి, ఎన్నో నేర్చుకోవాలి. అందుచేత గుర్తుపెట్టుకోండి భూలోకవాసులు చేసేవన్నీ పైలోకవాసులు చూస్తూ ఉంటారు ఇది మాత్రం మర్చిపోకండి.

# ఆత్మ జ్ఞానం గొప్పతనం

ఆత్మజ్ఞానం గురించి ఎక్కువగా మాట్లాడుకుంటున్నాం. ఎందుకంటే దుఃఖం నుండి బయటపడటానికి, దుఃఖం లేకుండా జీవించడానికి ఆత్మజ్ఞానం అత్యంత అవసరం. ఎంత జ్ఞానం పొందాలని ప్రయత్నించినా, మమకారాలు మరియు బాంధవ్యాలు మన ఎదుగుదలకు అడ్డుగా నిలుస్తాయి. ఎన్నో జన్మలుగా ఈ మమకారాల వల్లనే, ఈ బంధాల వల్లనే మానవులు ఆధ్యాత్మికంగా ఎదగలేక పోతున్నారు. జ్ఞానం సంపాదించ లేకపోతున్నారు. ఐదు లేదా పది జన్మలు కాదు, వందలాది జన్మలు ఇలా గడిచిపోతున్నాయి. సాధించాలని ఉన్నా సాధించలేకపోతున్నారు, దానికి ప్రధాన కారణం మాయ.

భూమిపై జన్మించిన వెంటనే జీవుడు మాయలో పడిపోతాడు. భూమి నుండి నిష్క్రమించిన తర్వాత మాయ నుండి బయటపడతాడు. కానీ అప్పటికే జీవితం ముగిసిపోతుంది, అందువల్ల ప్రయోజనం ఉండదు, మళ్లీ జన్మ తీసుకోవాల్సి వస్తుంది. జన్మ తీసుకోవడం తప్పుకాదు. కానీ జన్మ అనేది అంత తేలికైన విషయం కాదు, అందుకే త్వరగా జ్ఞానం పొందాలన్నా, జ్ఞాన వంతులు కావాలన్నా, ఈ మాయా ప్రభావం నుండి బయటపడాలి. ముఖ్యంగా మమకారాలుఉండకూడదు.

ఈ విషయాన్నే శంకరాచార్యులవారు "జాగ్రత్త పంచకం" ద్వారా బోధించారు. ఇందులో ఐదు శ్లోకాల ద్వారా కొన్ని విషయాల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. శంకరాచార్యుల వంటి మహా జ్ఞాని ఒక విషయాన్ని ప్రత్యేకంగా హెచ్చరిస్తూ చెబుతున్నారంటే, అది ఎంత గొప్పదో అర్థం చేసుకోవాలి.

ఆ జాగ్రత్త పంచకంలో ఒక శ్లోకం:

**శ్లో॥ మాతా నాస్తి పితా నాస్తి**
**నాస్తి బంధు సహోదర: ।**
**అర్థం నాస్తి గృహం నాస్తి**
**తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త ॥**

దీని తాత్పర్యం ఏమిటంటే తల్లి, తండ్రి, బంధువులు, సహోదరులు, ధనం, ఇల్లు ఇవన్నీ శాశ్వతం కావు. అందువల్ల ఓ మానవులారా! జాగ్రత్తగా ఉండండి అని హెచ్చరిస్తున్నారు. ఈ మాట విన్నప్పుడు ఆశ్చర్యంగా అనిపిస్తుంది. "తల్లి లేదు, తండ్రి లేదు, బంధువులు లేరు, ఇల్లు లేదు, ధనం లేదు" అన్నారు ఏమిటి? వీరందరిని చూస్తున్నాం, అనుభవిస్తున్నాం కదా? మరి అవి లేవు అని ఎందుకు అంటున్నారు? అని అనిపిస్తుంది.

ఇది మీరు "నేను దేహం" అనే భావంలో ఉన్నంత వరకు అర్థం కాదు. కానీ "నేను ఆత్మను" అనే అవగాహనకి వచ్చినప్పుడు అర్థం అవుతుంది.

ఈ సత్యాన్ని అర్థం చేసుకున్నవాడు జ్ఞాని, అర్థం కాని వాడు అజ్ఞాని. చాలామంది అడుగుతుంటారు "అజ్ఞానంలో ఉంటే నష్టం ఏమిటి?" అని. అజ్ఞానంలో ఉంటే వెంటనే కనిపించే నష్టం ఏమీ లేకపోవచ్చు, కానీ జన్మలు పెరుగుతాయి, దుఃఖం పెరుగుతుంది, సమస్యలు పెరుగుతాయి. కొంతమంది "దుఃఖం వచ్చినా నాలుగు రోజులకు తగ్గిపోతుంది కదా?" అని అంటారు. కానీ అలాంటి నిర్లక్ష్యం చివరకు భరించలేని మానసిక బాధలకు దారి తీస్తుంది, కొన్నిసార్లు ఆత్మహత్య వరకు కూడా తీసుకెళ్లగలదు. ఈ పరిస్థితి ఎందుకు వస్తుంది?

సృష్టి సత్యాన్ని తెలుసుకోక పోవడం వల్ల. మీరు తల్లి, తండ్రి,

బంధువులు, ధనం, ఇల్లు, ఆస్తి ఇవే జీవితం అనుకుంటారు, వాటి కోసమే పగలు రాత్రి శ్రమిస్తారు వాటి కోసమే తప్పులు చేస్తారు, పాపాలు చేస్తారు,అధర్మానికి కూడా పాల్పడతారు. కానీ ఇవన్నీ శాశ్వతంగా ఉండేవి కావు, ఒకరోజు అదృశ్యమైపోతాయి,మాయమైపోతాయి

ఎందుకంటే మీరంతా పర బ్రహ్మ చేత సృష్టించబడిన వారే. అందుకే ఆ సృష్టికర్తను “జగన్నాటక సూత్రధారి” అని పిలుస్తారు. అంటే ఈ జగత్తు అనే నాటకాన్ని నడిపించే వాడు అని అర్థం.

ఈ ప్రపంచం ఒక మహా నాటకం వంటిది. మనం అందులో పాత్రధారులం. ఎవరో కొడుకుగా, ఎవరో కూతురుగా, ఎవరో తల్లిగా, ఎవరో తండ్రిగా, ఎవరో భర్తగా, ఎవరో భార్యగా పాత్రలు పోషిస్తున్నాం. ఒక నాటకంలో రాజు పాత్ర వేసిన వ్యక్తిని ఊహించండి. నాటకం జరుగుతున్నంతసేపు అందరూ అతని మాట వింటారు, అతడు ఆజ్ఞలు ఇస్తాడు. అతనికి రాజభవనం ఉంటుంది, కోశాగారం ఉంటుంది, సేవకులు ఉంటారు, కానీ నాటకం ముగిసిన తర్వాత ఏవీ ఉండవు.

అలాగే ఈ జీవితం కూడా ఒక పాత్ర మాత్రమే. ఈ జన్మ ముగిసిన తర్వాత తల్లి మారిపోతుంది, తండ్రి మారిపోతాడు, భార్య మారిపోతుంది, భర్త మారిపోతాడు, ఇల్లు మారిపోతుంది, ఆస్తులు మారిపోతాయి.

అందుకే శంకరాచార్యులవారు, **“మాతా నాస్తి, పితా నాస్తి, నాస్తి బంధు సహోదరః”** అన్నారు.

అంటే ఇవన్నీ శాశ్వతం కావు. వాటిని నిజమైనవిగా భావించి వాటిపై మమకారం పెంచుకోవద్దు అంటారు.

అందుకే జీవితంలో ఒక ముఖ్యమైన సూత్రం గుర్తుపెట్టుకోవాలి:

**“వస్తే రాని, ఉంటే ఉండని, పోతే పోని”** కానీ జ్ఞానాన్ని మాత్రం వదులుకోకండి.

మహాభారతంలో అభిమన్యుడు మరణించినప్పుడు అర్జునుడు తీవ్రంగా విలపించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుని అభిమన్యుడు ఉన్న లోకానికి పంపించాడు అప్పుడు అభిమన్యుడు ఎవరు నువ్వు అని అడిగాడు అప్పుడు అర్జునుడు ఆశ్చర్యపోయి మరల తిరిగి కృష్ణుని వద్దకు వచ్చాడు.

అంటే ప్రతి జన్మకు ఎంతోమంది తల్లిదండ్రులు, బంధువులు, సంబంధాలు మారుతూనే ఉంటాయని అర్థమయ్యేలా చేశాడు.

అందుకే ఈ జీవితంలో ఉన్నవన్నీ శాశ్వతమని భావించి వాటి కోసం బాధపడటం కన్నా, వాటిని సద్వినియోగం చేసుకోవడం నేర్చుకోవాలి. ఉన్న వాటిని ధర్మబద్ధంగా ఉపయోగించండి, మీకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించండి. కానీ వాటిపట్ల మితిమీరిన మమకారం పెంచుకోకండి. ఎందుకంటే దుఃఖానికి మూలం వస్తువులు కావు. “ఇవి శాశ్వతంగా నావే” అనే భ్రమే దుఃఖానికి కారణం.

అందుకే పత్రి గారు, శంకరాచార్యులవారు మరియు మహా జ్ఞానులు అందరూ ఒకటే చెబుతున్నారు, “జ్ఞానాన్ని సంపాదించుకోండి, జీవితం నాటకమని అర్థం చేసుకోండి, మమకారాన్ని తగ్గించుకోండి, అప్పుడు దుఃఖం తగ్గుతుంది, శాంతి పెరుగుతుంది, ఆత్మ సత్యం అనుభవంలోకి వస్తుంది.”

# ఆత్మతో అనుసంధానం అవ్వాలంటే ?

పత్రిగారు, **“నా దారి ఎడారి, నా పేరు బికారి”** అనే పాటకు అర్థం చెప్పారు.

మామూలుగా ఎవరికీ అర్థం కాదు. దాంట్లో ఎంత అంతరార్థం ఉందో! ఒక పదం విన్నా ఒక వాక్యం విన్నా ఒక విషయం చదివినా ఆయన అంత లోతు అర్థాలతో చెప్తారు. ఆయన వీరబ్రహ్మేంద్ర స్వామివారు చెప్పినటువంటి పద్యాలు చదువుతూ ఉంటే ఆయనకి అందులో అంతులేని అర్థం కనిపించింది .

ఆయన అండమాన్ వెళ్ళినప్పుడు అక్కడ మూడు రోజులు ఉన్నారు. అప్పుడు ఆయన, కాళికాంబ సప్తశది అని వ్రాశారు. అలా ఏ పదానికైనా అర్థం చెప్తూ ఉంటారు, నాకు అదే బాగా నచ్చింది. ఆ జ్ఞానానికే నేను ఆకర్షితుడై ఆయనకు సరండర్ అయ్యాను.

అంతటి జ్ఞానం రావాలి అంటే బుద్ధి వికసింప చేసుకోవాలి, మనసు శూన్యం చేసుకోవాలి.

మనసు శూన్యము అంటే మనసు లేకుండా చేసుకోవడం, మనసును నిర్వీర్యం చేయడం, మనసును స్పటికిలా తయారు చేయాలి అని రమణ మహర్షుల వారు చెప్తారు.

క్రిస్టల్ క్లియర్ అంటే మానసరోవరం వెళ్ళి చూస్తే మీకు తెలుస్తుంది. ఎంత లోతు నీరు ఉన్నా అక్కడ నీటి అడుగున ఉన్నటువంటి ఆ రాళ్ళు, ఆ చేపలు అన్నీ కనిపిస్తాయి. ఇంకేమేమి ఉన్నా అన్నీ కనిపిస్తాయి. అదే క్లియర్ అంటే? మీ మనసు కూడా అలా తయారు చేసుకోవాలి. ఆంటే మనసు యొక్క ప్రభావం ఉండకూడదు. మనసు ప్రభావం లేకపోతే ఉండేది ఆత్మే.

ఆ ఆత్మనే పరబ్రహ్మ అంటారు.

ఒకటే గుర్తుపెట్టుకోండి మనసు శూన్యం అయితేనే మీరు ఆత్మతో కనెక్ట్ అవుతారు. మనసు శూన్యం కాకపోతే మనసు మనసులాగే ఉంటుంది, మనసు శూన్యం అయితే ఆత్మతో మీరు కనెక్ట్ అయి ఎంత లోతుల్లోకైనా వెళ్తారు, ప్రతి విషయం ప్రతి పాయింట్ అలాగే చెప్తారు. పత్రిగారు అలా చెప్పినవే నన్ను ప్రభావితం చేశాయి.

మొన్న భీమవరం క్లాస్ లో క్లాస్ స్టార్ట్ చేసే ముందే చెప్పాను ఒక్కసారి మీ ఫోన్‌ని చెక్ చేసుకోండి ధ్యానం మధ్యలో, క్లాస్ మధ్యలో మోగకూడదు అని. ఒకసారి చూసుకోవచ్చుగా? చెక్ చేసుకోవచ్చుగా? ఒకాయన ఫోన్ మోగింది. పెద్దాయనే మరి మామూలుగా కూడా చెప్పలేదు మోగితే నేను మామూలుగా ఊరుకోను. తర్వాత మీరు నన్ను అపార్థం చేసుకొన్నా నేను ఏం చేయలేను అని చెప్పాను. క్లాస్ మధ్యలో మోగింది, నేను చాలా సఫర్ అయ్యాను, ఆ సబ్జెక్ట్‌లో లీనమై చెప్తూ వుంటే, ఆ సంగతి ఎవడికి తెలుస్తుంది?

ఎందుకంటే? అక్కడ మనసు పని చేయదు దేని మీద ఉండదు, ఊరికే చూస్తున్నట్టు ఉంటుంది. కానీ దేని మీద ఉండదు, చెప్పే సబ్జెక్ట్ మీదే ఉంటుంది, అలా ఆ ఫ్లోలో అలా వెళ్ళిపోతూ ఉంటుంది. అప్పుడు ఫోన్ మోగింది, ఇప్పుడు నా పరిస్థితి చూడండి. అక్కడ లైవ్ ఆఫ్ చేయాలా! ఆ లైవ్ లో చెప్తూ నేను వాడితో కట్టేయమని చెప్పాలా? ఏం చేయాలి చెప్పండి.

వాడు కట్టట్లేదు ఇప్పుడు నేను ఎలా చెప్పగలను చెప్పండి? ఎంత ఇబ్బంది పడ్డాను, మీ గొడవ మీరు చూసుకుంటున్నారు కానీ నా గొడవ చూడరే! అయిపోయాక నేను క్లాసు బాగా చెప్పలేదు అంటారు. ఎందుకు చెప్పలేదు అన్నది మీకు అర్థం కాదు, నా ఏకాగ్రతని ఎంత భంగం చేశాడు ఏం చేయను అలాగే సహించా, చాలా డిస్టర్బ్ అయ్యాను, ఇంకా ఆ లైవ్

అయిపోయాక అతన్ని పిలిచి చెప్పాను. ఇంత నిర్లక్ష్యంగా ఎందుకు అలా చేశావ్ అని కొంచెం గట్టిగానే కేకలేశా, అలా కేకలు వేయడంలో కూడా ఒక అర్థం ఉంది. అది మిగతా వాళ్ళకు కూడా పాఠం కావాలి, అప్పుడు వాళ్ళు కూడా జాగ్రత్తగా ఉంటారు.

చాలామంది బయటికి వెళ్ళగానే సెల్ ఆన్ చేసి మాట్లాడేస్తారు, మర్చిపోయి లోపలికి వచ్చి ఇబ్బంది పెడతారు. పాఠం చెప్పే ముందు ఎన్ని సార్లు చెప్పగలను చెప్పండి? సెల్ కట్టేసుకోండి, చెక్ చేసుకోండి అని.

తిడితే ఇంకొక ఆయన వచ్చి ఏమంటాడంటే? మీరు అంత గట్టిగా తిట్టకూడదండి అంటాడు. కాని నేను స్పష్టంగా చెప్పాను, నా వ్యవహారం నచ్చకపోతే నువ్వు వెళ్ళిపోవచ్చు అన్నాను, వాడు వెళ్ళి పోయాడు. ఎంత మూర్ఖుడో చూడండి, వాడికి మూడు రోజులు జ్ఞానం పోయింది.

ఇలాగే పత్రిగారికి దూరమైపోయి నష్టపోయిన వాళ్ళు వేల మంది ఉన్నారు. నాకు తెలుసు కానీ మేము నిలబడ్డాం, అందుకే ఈ స్థాయికి రాగలిగాం. విచిత్రం ఏమిటంటే ఆ తిట్లు తిన్న ఆయన అక్కడే ఉన్నాడు, దానికి రియాక్ట్ అయినవాడు వెళ్ళి పోయాడు. నిజంగా బాధపడితే వాడు బాధపడాలి, వాడు బాధపడలేదు, తాను చేసింది పొరబాటు అన్న సంగతి వాడికి అర్థమయింది. అసలు గురువు ఎలా ఉండాలో కూడా వీళ్ళు చెప్తారా? పత్రిగారు ఇదే అంటారు ఏవండీ గురువుకి శిష్యుడు డైరెక్షన్ ఇవ్వగలడా? అని.

ఒకటే నేను చెప్తున్నానండి ఆత్మతో కనెక్ట్ అవ్వండి. మనసును శుద్ధి చేసుకోవడం కాదు, శూన్యం చేసుకునే ప్రయత్నం చేయండి. మనసును శుద్ధి అవుతే బుద్ధి వికసిస్తుంది, శూన్యం అవుతే జ్ఞానం ఉదయిస్తుంది, ఆ జ్ఞానం పెరిగే కొద్దీ మీరు ప్రతి విషయాన్ని అర్థం చేసుకుంటారు.

# మనస్సు యొక్క స్థితులు

ధ్యానం అంటే conscious కాదు, sub conscious కాదు, conscious less స్థాయికి చేరడం.

ఈ మూడు స్థాయిలు మనసుకు సంబంధించినవి. ఎందుచేత అంటే మనసు మూడు రకాల అవస్థల్లో ఉంటుంది.

1. Conscious Mind అంటే జాగ్రధావస్థ దాన్నే చేతనా అవస్థ అంటారు.

2. Sub-conscious Mind అంటే స్వప్నావస్థ దానినే అంతః చేతనావస్థ అంటారు.

3. Supra Conscious Mind అంటే సుషుప్తి అవస్థ అంటారు. దానినే అధిచేతనావస్థ అంటారు.

1. Conscious Mind అంటే జాగ్రధావస్థ అనుకున్నాం కదా? సహజంగా ఇంద్రియాలు మనసు ప్రమేయంతో పనిచేస్తూ ఉంటాయి. మనసు ప్రమేయంతో ఇంద్రియాలు పని చేయడాన్ని జాగ్రదావస్థ అంటారు. అటువంటి మనసును చేతనావస్థ అంటారు. ఇక్కడ ఇంద్రియాలతో పాటు, మనసు కూడా పనిచేస్తూ ఉంటుంది.

2. Sub-conscious Mind ఇక్కడ ఇంద్రియాల ప్రమేయం ఉండదు, మనసు ఒక్కటే పనిచేస్తూ ఉంటుంది. దాన్నే స్వప్నావస్థ అంటారు.

3. Supra Conscious Mind ఇక్కడ ఇంద్రియాలు పని చేయవు, మనసు పని చేయదు. మనసు, ఇంద్రియాలు ఉంటాయి కానీ పని చేయవు. దీన్ని సుషుప్తి అవస్థ అంటారు. అలా పని చేయని మనసుని Supra Conscious Mind అంటారు.

అంటే ఇక్కడ మీరు గమనించండి! మనసును మూడు రకాలుగా

పేర్కొన్నారు, ఇందులో రెండు రకాలుగా పనిచేస్తూ ఉంటుంది, మూడో దాంట్లో పనిచేయదు.

Conscious Mind లో ఇంద్రియాలు, మనసు రెండు పనిచేస్తాయి

Sub-consciousలో ఇంద్రియాలు పనిచేయవు, మనసు ఒక్కటే పనిచేస్తుంది. అంటే మనసు లోలోతుల్లో ఉన్నటువంటివన్నీ బయటకి వస్తూ ఉంటాయి.

Sub-conscious Mind స్థితిలో ఉన్నప్పుడు, మనసు లోలోతుల్లో ఉన్నవన్నీ పైకి వస్తాయి. ఆ లో లోతుల్లో ఉన్నవి Conscious స్టేజ్ లో రావు. ఎప్పుడు వస్తాయి? Sub-conscious స్టేజ్‌లో వస్తాయి. దాన్ని ఏమంటారు అంటే స్వప్నావస్థ అంటారు. మీరు కలలు ఎలా వస్తాయి? ఎక్కడి నుంచి వస్తాయి? అనుకుంటారు. ఆ కలలు జరిగేటప్పుడు అంతా నిజం అన్నట్టుగా అనిపిస్తుంది. కాని కళ్ళు తెరిస్తే ఏమీ ఉండదు? ఎందుకు లేదు?

అక్కడ ఇంద్రియాలు ఎప్పుడైతే పని చేయవో! అంటే? సహజంగా ఇంద్రియాల ద్వారా మనసు పని చేస్తుంది. కళ్ళు అంటే దానికి మనసే కారణం. చూసేది మనసే! కాని కళ్ళు కాదు. వినేది మీ చెవులు కాదు మనసే! అలా ఏది పని చేస్తున్నా మనసే!

మరి అటువంటి మనసు! ఇంద్రియాలు పని చేయకపోతే ఏం చేస్తుంది? ఏముంది చేయడానికి? ఏమీ లేదు. కానీ ఆ మనసు యొక్క లోలోతుల్లో ఉండిపోయినవన్నీ బయటకి వస్తాయి. న్యాయంగా అన్నీ ఇంద్రియాల ద్వారానే గ్రహిస్తూ ఉంటుంది. ఇంద్రియాలు ఎప్పుడైతే పని చేయలేదో! అప్పుడు మనసు దాని లోలోతుల్లో ఉన్నవి బయటికి తీసుకువస్తూ ఉంటాయి. దానికి ఉన్న తీరని కోరికలు గానీ ఇంకేమైనా సరే అవి అక్కడ బయటకి వస్తాయి. ఇంద్రియాలు పని చేస్తే అవి రావు.

అది యాక్చువల్‌గా మీరు నిద్రపోయినప్పుడు జరుగుతుంది, మేలుకువలో జరగదు. అందుకే మేలుకుంటే కలలు రావు? ఏదో మాటలు చెప్తుంటే, ఊహలలో ఊహిస్తుంటే ఏంట్రా పగటికలలు కంటున్నావు? అంటారు.

పగటికలలు! అంటే నాకు ఆ కారు కొనుక్కోవాలని ఉంది, మోటార్ సైకిల్ కూడా కొనలేడు, కారు కొంటాడట! గాజులకే డబ్బు లేదు, బంగారు గాజులు చేయించుకుంటుందట! డైమండ్ నెక్లెస్ పెట్టుకుంటుందట! ఆ మాటలు మాట్లాడితే ఏమంటారు చెప్పండి? ఏంటి పగటికలలు కంటున్నావ్? అంటారు.

రాత్రి అలాగే కంటాడు కొంతమంది పగలు కూడా కంటూ ఉంటారు. నేను కోట్లు సంపాదిస్తాను, వాడిలా అయిపోతాను, వీడిలా అయిపోతాను అంటే, అప్పుడు ఏమంటారు? పగటి కలలు కనకురా అంటారు.

ఏమిటిరా పగటి కలలు కంటున్నావ్ అంటే? కల ఎంత నిజమో! ఇప్పుడు నువ్వు అనుకుంటున్నది కూడా అంతే అని వాడికి చెప్పడం, పిచ్చ ఎదవ! అని తిట్టడం.

మీరు చూడండి జాగ్రథావస్థలో Conscious మైండ్ లో ఎన్నో చూస్తూ ఉంటారు. కార్లు చూస్తూ ఉంటారు, మేడలు చూస్తూ ఉంటారు, ఫంక్షన్లు, పార్టీలకి వెళ్తూ ఉంటారు, ఎన్నెన్నో చూస్తూ ఉంటారు. చూస్తున్నప్పుడు సహజంగా మీ దగ్గర ఏది లేదో! అది కావాలని అనిపిస్తూ ఉంటుంది.

మీరు రేకులషెడ్‌లో ఉంటున్నారు, ఓ పెద్ద బిల్డింగ్ చూశారు, ఏమనిపిస్తుంది చెప్పండి? నాకు కూడా అలాంటి ఇంట్లో ఉంటే ఎంత బాగుంటుంది అనుకుంటారు.

ఏదైనా ఒక ఫంక్షన్ కో పార్టీకి వెళ్ళారనుకోండి, అక్కడకు వచ్చిన వాళ్ళంతా, పెద్ద పెద్ద చీరలు కట్టుకొని, మేకప్పులు చేసుకుని, వస్తువులు

పెట్టుకుని, బాగా అలంకరించుకుని వస్తారు.  అవి చూస్తూ ఉంటే, నాకు కూడా అలాంటివి ఉంటే బాగుంటుంది అనుకుంటారు. అలా అవి చూసినప్పుడల్లా అనిపిస్తుంది.

కానీ అవి ఎప్పుడైనా కొనగలరా? అంటే కొనలేరు. కానీ అవి చూసినప్పుడు కొనాలని అనిపిస్తుంది? కనీసం గాజులు కొనుక్కున్నా చాలు అనుకుంటూ ఉంటారు. అలా చూసే కొద్దీ ఆ కోరిక మీ మనసు యొక్క లోతుల్లోకి వెళ్ళి అణిగిపోయి ఉంటుంది. అలాగే మామూలు సైకిల్ మీద వెళ్తున్నవాడు కార్లు చూసాడు. అవి చూస్తే వాడికి నేను కూడా ఇలాంటి కారులో తిరిగితే  ఎంత బాగుంటుంది? అనుకుంటాడు.

కానీ కారు కొనే స్టేజ్ వాడికి లేదు, కనీసం మోటార్ సైకిల్ కొనే స్టేజ్ లేదు, ఇంక వాడు కారు ఎప్పుడు కొంటాడు ? వాడు సంపాదించే డబ్బు వాడి తిండికే సరిపోదు, ఇంకా కారు ఎక్కడ కొంటాడు? కాని చూసినప్పుడల్లా కొనాలని అనిపిస్తూ ఉంటుంది, కార్లో తిరిగితే  బాగుంటుంది అని అనిపిస్తుంది.

అలా ఆ కోరిక మనసు యొక్క లోతుల్లోకి వెళ్ళిపోయి వుండిపోతుంది. రాత్రి నిద్రపోయినప్పుడు ఇంద్రియాలు ఏమీ పని చేయవు. అప్పుడు ఈ మనసు యొక్క  లోతుల్లో ఉండిపోయినవి  బయటకు వస్తాయి.

అప్పుడు వాడు కారు కొన్నట్టు వూహిస్తూ ఉంటాడు, వాడే డ్రైవ్ చేస్తున్నట్టు, దాంట్లో తిరుగుతున్నట్టు, తిరుగుతుంటే వాడి ఫ్రెండ్స్ అంతా చూసి ఆశ్చర్య పోతున్నట్టు! ఏరా ఎప్పుడు కొన్నావ్ నువ్వు?  అంటే ఈ మధ్యే కొన్నానురా అని ఫోజు కొట్టినట్టు వూహిస్తూ ఉంటాడు.

అవన్నీ అలా వూహిస్తూ ఉబ్బిపోతూ ఉంటాడు. ఇంకా అత్తవారింటికి ఆ కారులో వెళ్ళినట్టు వూహిస్తూ ఉంటాడు, ఆ ఊహలనే కలలు అంటారు. ఈ లోపులో వాడి పెళ్ళాం  ఏమిటా మొద్దు నిద్ర?  అని లేపుతుంది. అప్పుడు

కళ్ళు తెరుస్తాడు, తెరిస్తే ఏముంది? కారు లేదు, ఏమీ లేదు.

వాడు అప్పటిదాకా కార్లో తిరిగానని అనుకున్నాడు, కాని కళ్ళు తెరిస్తే ఏమీ లేదు, ఏమంటాడు చెప్పండి? “ఓస్ కలా?” అంటాడు. అంటే ఇప్పటిదాకా జరిగినట్టుగా అనిపించింది, నిజం అనుకున్నాడు, ఉబ్బిపోయాడు, చూస్తే ఏమీ లేదు, అన్నీ మాయమైపోయాయి.

అప్పుడు అనుకుంటాడు, ఈ కల నిజం అవుతే ఎంత బాగుండును అని. ఎవరైనా అలాంటి కలలు వస్తుంటే చెదిరిపోకుండా ఉంటే బాగుండును అనిపిస్తుంది, కానీ ఏమిటో కలలు అలా ఉండవు చెదిరిపోతూ ఉంటాయి.

అలాగే ఒకావిడకి డైమండ్ నెక్లెస్ పెట్టుకుంటే బాగుంటుందని అనిపించేది, ఆవిడకి ఆ కోరిక మనసు లోలోతుల్లో ఉండిపోయింది. నిద్రపోయినప్పుడు ఆవిడ డైమండ్ నెక్లెస్ కొన్నట్టు, అది పెట్టుకుని ఆ ఫంక్షన్‌కి వెళ్ళినట్టు, అందరూ చూసి ఏమిటే! ఎప్పుడు కొన్నావు? భలేగా ఉందే! ఎంత బాగుంది? అని అంటూ ఉంటే ఆవిడ ఎంత ఉబ్బిపోతుందో!

ఈ లోపల మొగుడు లెగ్గొట్టాడు ఏమిటా మొద్దు నిద్రా? తెల్లారిపోయింది, టిఫిన్ ఎప్పుడు చేస్తావు? అనగానే కళ్ళు తెరిచింది. తీరా కళ్ళు తెరిస్తే ఏమున్నాయి? డైమండ్ నెక్లెస్ లేదు, ఏదీ లేదు, “ఓస్ కలా” అంది. కానీ అప్పుడు నిజంగా జరుగుతున్నట్టుగా ఉంటుంది, నిజం అనిపిస్తుంది, కానీ కళ్ళు తెరిస్తే ఏమీవుండవు.

Sub-conscious Mindలో జరిగేదంతా ఇదే. గుర్తుపెట్టుకోండి గైడింగ్ మెడిటేషన్ చేయించేవాళ్ళు మిమ్మల్ని మెల్లి మెల్లిగా Sub-conscious Mind లోకి తీసుకెళ్తారు.

వాళ్ళు మీచేత కళ్ళు మూయించి గైడ్ చేస్తూ ఉంటారు. మీరు గోల్డెన్ పిరమిడ్ లో కూర్చున్నారని ఊహించుకోండి! మీకు ఎంతో ఎనర్జీ

వచ్చేస్తుందని ఊహించుకోండి! అని చెబుతూ ఉంటారు. మీరు అలా జరిగిపోయినట్టుగా ఊహిస్తూ ఉంటారు.

శిరిడీ బాబా వచ్చి నీ కుడి ప్రక్కన కూర్చున్నాడని ఊహించుకోండి!

అనగానే విచిత్రం బాబా వచ్చేస్తాడు, వచ్చి ఈవిడ ప్రక్కన కూర్చున్నట్టు భావిస్తారు. వాడు ఇంకా నీ ఎడం ప్రక్క ఆంజనేయ స్వామి వచ్చి కూర్చున్నట్టు ఊహించుకో అంటే ఆయన వచ్చేస్తాడు. కాని కళ్ళు తెరిస్తే ఎవరూ ఉండరు, ఏమీ ఉండదు.

చూడండి కలలో కారు రాగాలేంది శిరిడి బాబా రాడా? ఆంజనేయ స్వామి రాడా? ఎవరైనా వస్తారు. మీ అనుభవాలు చెప్పండి అంటే... ఇవే చెప్తారు?

శిరిడి బాబా వచ్చేసాడండి, ఆంజనేయ స్వామిని రమ్మంటే విష్ణువే వచ్చేసాడండి, లేకపోతే మహావతార్‌బాబా వచ్చేశాడండి అంటారు. కానీ విచిత్రం ఏంటంటే? కళ్ళు తెరిచి రమ్మంటే ఎవరూ రారు. నిజంగా పిలిస్తే వచ్చేవాళ్ళు అయితే కళ్ళు తెరిచి రమ్మన్నా రావాలి కదా? ఎందుకు రాలేదు?

అందుచేత Sub-conscious స్టేట్ లో జరిగేది ఏదీ వాస్తవం కాదు, నిజం కాదు అని గుర్తుపెట్టుకోండి. వీళ్ళు చెప్పేది అన్నీ మిమ్మల్ని ఊరికే మభ్య పెట్టడం తప్ప నిజం కాదు. ఎనర్జీ రావడం, అలా అయిపోయింది, ఇలా అయిపోయింది, అది తగ్గిపోయింది అని అనుకోవడం, సహస్రారానికి నువ్వు చేరిపోయావని అనుకోవడం, నీ చక్రాలు యాక్టివేట్ అయిపోయాయని అనుకోవడం లాంటివన్నీ ఊహలే!

అది ధ్యానం కాదు, మీ మనసు Consciousలో ఉన్నా, Sub-consciousలో ఉన్నా దాన్ని ధ్యానం అని అనరు. Conscious, Sub-conscious దాటి, Supra Conscious స్టేజ్ కి మీరు వెళ్తేనే మీరు ధ్యానం

చేస్తున్నట్టు.

ఆ స్థాయికి మిమ్మల్ని తీసుకు వెళ్ళగలిగేది గైడింగ్ కాదు. పత్రి గారు చెప్పిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ఒక్కటే. ధ్యానం చేస్తున్నారు అంటే Supraconsious స్టేట్ కి మీరు వెళ్ళాలి.

జరగనివన్నీ జరుగుతున్నాయి అనుకోవడం Sub Conscious State. అంటే గాలిలో మేడలు కట్టడం అంటారు. ఈ గైడింగ్ మెడిటేషన్ వాళ్ళు మీ చేత గాలిలో మేడలు కట్టిస్తారు. కల ఎంత నిజమో! గైడింగ్ మెడిటేషన్లో అనుభవాలు కూడా అంతే నిజం!

ఒకటే చెప్తున్నాను పత్రిగారు చెప్పింది పట్టుకోండి! పత్రి గారి కంటే గొప్పవాళ్ళు లేరు, ఆయన చెప్పింది చేయండి! ఆయన శిష్యులు కోకొల్లలుగా ఉన్నారు. వాళ్ళు మనకెందుకు? శిష్యుని పట్టుకోవాలా? పత్రిగారిని పట్టుకోవాలా?

పత్రిగారు ధ్యానం అంటే " శ్వాస మీద ధ్యాస " అని స్పష్టంగా చెప్పారు. అందుచేత గైడింగులు ఇంకేమీ అవసరం లేదు "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేస్తే చాలు, అన్ని లాభాలు మీరు పొందుతారు.

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?


a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

## ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

రిజిస్ట్రేషన్ కొరకు : ***సింధూర, సెల్: 8555995217***

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు - రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు - రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు -రూ.90/-
23) ముఖ్యమైన సందేశాలు-1 -రూ.80/-
24) ముఖ్యమైన సందేశాలు-2 -రూ.90/-
25) కర్మ సిద్ధాంతం - రూ.80/-
26) ధ్యానమంటే ? - రూ.80/-
27) త్రివిధాలు - రూ.80/-
28) ఉత్తమ పురుషుడు - రూ.80/-
29) వశిష్ఠుల వారి సందేశాలు - రూ.70/-
30) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
31) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
32) జ్ఞాన జ్యోతి - రూ.70/-
33) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
34) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
35) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
36) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.70/-
37) బుద్ధుని సందేశాలు - రూ.70/-
38) భూతదయే దైవత్వం - రూ.70/-
39) ఆత్మహంతకులంటే ఎవరు? - రూ.70/-
40) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
41) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
42) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
43) మానవునిలోని చెడు -రూ.70/-
44) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
45) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
46) మోక్షం అంటే? - రూ.70/-
47) కబీరు సందేశాలు-1 -రూ.70/-
48) మనసు-1 - రూ.70/-
49) మనసు-2 - రూ.70/-
50) " అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి? " రూ.70/-
51) ధ్యాన శక్తి కోల్పోకూడదంటే - రూ.70/-
52) మరణానంతరం జరిగేది-1 - రూ.60/-
53) మరణానంతరం జరిగేది-2 - రూ.70/-
54) మరణానంతరం జరిగేది-3 - రూ.60/-
55) కబీరు సందేశాలు-2 - రూ.60/-
56) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
57) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
58) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
59) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
60) అతీంద్రియ శక్తులు - రూ.60/-
61) ఆలోచించండి - రూ.60/-
62) నిర్వాణ మార్గం - రూ.60/-
63) ధ్యానులకు సూచనలు - రూ.60/-
64) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
65) మమకారం - రూ.60/-
66) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
67) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
68) మాస్టర్‌గా ఎదగాలంటే? - రూ.50/-
69) భగవంతుని ఇష్టులవ్వాలంటే - రూ.50/-
70) సంకల్పమంటే? - రూ.50/-
71) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
72) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
73) మూడురకాల భవిష్యత్తులు - రూ.50/-
74) అరిహంత్ - రూ.50/-
75) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన - రూ.50/-
76) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
77) విదురుని సందేశాలు - రూ.40/-
78) మూడురకాల జీవితాలు - రూ.40/-
79) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే - రూ.40/-
80) ఛాంపియన్ అవ్వాలంటే? - రూ.40/-
81) బ్రహ్మం అంటే? - రూ.40/-
82) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం - రూ.40/-
83) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం - రూ.40/-
84) మహాత్ముల సందేశాలు - రూ.40/-
85) సత్యం - రూ.40/-
86) చక్రాలు - రూ.40/-
87) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
88) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
89) మౌన ధ్యానం - రూ.40/-
90) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
91) శాకాహారమే మానవాహారం - రూ.15/-
92) అహింస మరియు శాఖాహారం - రూ.15/-



ప్రపంచంలో నేను దేహం అని అనుకుంటూ బ్రతికే వారి గురించి జిడ్డు కృష్ణమూర్తి గారు ఒక గొప్ప సందేశం ఇచ్చారు, ఆ సందేశం ఏమిటంటే!.

"అందరి కోసం బ్రతికినా మీకు దక్కింది ఏమిటి"?

"అసలు మీరు అంటే ఆత్మ వచ్చింది మీ కోసం, కాని బ్రతుకుతున్నది అందరి కోసం". అలా కష్ట పడుతూ, మిమ్మల్ని అంటే ఆత్మను త్యాగం చేస్తున్నారు. అంటే మిమ్మల్ని మీరు త్యాగం చేసుకొని, అందరి కోసం బ్రతుకుతున్నారు. సరే బ్రతుకుతున్నావు, అసలు నీకు దక్కింది ఏమిటి? మీరు చనిపోయి పైకి వెళ్ళాక అక్కడ కౌన్సిలింగ్ చేసేవాళ్ళు అడుగుతారు. అందరి కోసం బ్రతికావు. ఎన్నో చేశావు, ఎన్నో సాధించావు, ఎన్నో సంపాదించావు, ఎన్నో పోగేశావు కాని ఇక్కడికి వచ్చాక నీకు దక్కింది ఏమిటి? అని అడుగుతారు. అప్పుడు అర్థమవుతుంది జీవితమంతా కష్టపడ్డానే, ఎన్నో సంపాదించేనే, కాని ఒక్కటి నాకూడా రాలేదు, ఒక్కరు నాకోసం రాలేదు, అని ఆశ్చర్య పోతావు. ఈ విషయం పైకి వెళ్లాక తెలుసుకుంటే ఏ ప్రయోజనం లేదు, జీవించి ఉండగానే మీరు తెలుసుకోగలిగితే మీరు అంటే ఆత్మ ధన్యమైనట్టే.

- బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు

రూ.70/-

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|